


5



ప్రత్యేక అలంకరణలో త్రికోటేశ్వర స్వామి



విద్యుత్ కాంతులతో శోభిల్లుతున్న కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి సన్నిధి



తిరునాళ్ళకు గురవాయపాలెంలో నిర్మించిన భారీ విద్యుత్ ప్రభ



ప్రత్యేక అలంకరణలో గోవాడ బాలకోటేశ్వరస్వామి



విద్యుత్ వెలుగుల్లో పెదకాకాని ఆలయం



అమరావతిలో చలువ పందిళ్లు



క్వారీ ఆలయం వద్ద ఏర్పాట్లు

శివ పూజకు వేళాయే

నేడే మహా శివరాత్రి తిరునాళ్ల



కోటప్పకొండపై నందీశ్వరుడికి అభిషేకం

- విద్యుత్ వెలుగుల్లో దేదీప్యమానంగా కోటప్పకొండ
- తిరునాళ్లకు త్రికూటాద్రి ముస్తాబు
- గ్రామాల నుంచి కొండకు పయనమైన విద్యుత్ ప్రభలు
- కోటయ్యస్వామికి పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి ఆనం
- అర్ధరాత్రి లింగోద్భవ అభిషేకాలతో ఉత్సవాలు ప్రారంభం
- అమరావతి, కాకాని, గోవాడ, క్వారీ సహా శైవక్షేత్రాల్లో భారీగా ఏర్పాట్లు

మహా శివరాత్రికి.. శైవక్షేత్రాలు సిద్ధమయ్యాయి. విద్యుత్ వెలుగుల్లో కోటప్ప కొండ సహా శైవక్షేత్రాలు దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి. మంగళవారం అర్ధరాత్రి లింగోద్భవ అభిషేకాలతో ఉత్సవాలను ప్రారంభించేందుకు అర్చకులు, అధి కారులు సకలం సిద్ధం చేశారు. భారీగా తరలివచ్చే భక్తుల కోసం విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. కోటప్ప కొండ, అమరావతి, పెదకాకాని, క్వారీ, గోవాడ క్షేత్రాలు ఉత్సవాలకు సిద్ధమయ్యాయి. చేదుకో కోటయ్య.. చేదుకో అంటూ భక్తులు ప్రభలతో తిరునాళ్లకు తరలి వస్తున్నారు. శ్రీ త్రికోటేశ్వరస్వామి తిరునాళ్ల బుధవారం నేత్ర పర్వంగా జరగనుంది. ప్రభల పండుగగా పిలిచే కోటయ్య తిరునాళ్లకు 19 భారీ విద్యుత్ ప్రభలు కొండకు పయనమయ్యాయి. ప్రభలు తరలివచ్చే మార్గంలో ఎటువంటి అవాంతరాలు కలగకుండా నిర్వాహకులతో పాటు అధికారులు కూడా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. విద్యుత్ వెలుగుల్లో కొలువుదీరే ప్రభలను తిలకించేందుకు భక్తులు భారీగా తరలిరానుండటంతో సాంస్కృతిక కార్యక్ర మాలను నిర్వా హకులు ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్ర నలుమూలల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు కోటప్పకొండలోని శ్రీ త్రికోటేశ్వరస్వామి సన్నిధికి తరలిరానున్నారు. ఆయా ఆలయాల్లో స్వామి వార్ల దర్శ నాలకు, ప్రత్యేక పూజలకు తరలివచ్చే భక్తుల కోసం చలువ పందిళ్లతో క్యూలు ఏర్పాటు చేశారు.

8

ముగిసిన ప్రచారం



ఏసీ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ తదితరులు

- రేపు పట్టభద్రుల పోలింగ్
- ఆరు జిల్లాల పరిధిలో 483 కేంద్రాలు
- నేడు బ్యాలెట్ బాక్సులతో కేంద్రాలకు సిబ్బంది
- ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నేడు, రేపు డ్రై డే

గుంటూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి ప్రచారం ముగిసింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం మంగళవారం సాయంత్రం 4 గంటలకు ప్రచార కార్యక్రమాలు నిలిచిపోయాయి. చివరి రోజు కావడంతో మంగళవారం ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు వివిధ వర్గాలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. చివరి రోజైన మంగళవారం జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వీడియో ద్వారా కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ని గెలిపించాల్సిందిగా సందేశమిచ్చి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. మరోవైపు పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు వివిధ సంఘాలు, యూనియన్లను కలుసుకుని మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేశారు. ఎన్నికల బరిలో ఉన్న మిగతా అభ్యర్థులు ఆటోల ద్వారా మైకు ప్రచారం నిర్వహించారు. సోషల్ మీడియా ద్వారా కూడా పలువురు అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం చేశారు. ఆరు జిల్లాల పరిధిలోని 483 పోలింగ్ కేంద్రాల్లో గురువారం పోలింగ్ జరగనుంది. కాగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు ఒక్కటి కూడా నమోదు కాలేదని రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి తెలిపారు.

పోలింగ్‌పై అభ్యర్థుల దృష్టి

ఎన్నికల ప్రచారం ముగియడంతో అభ్యర్థులంతా పోలింగ్ రోజుపై దృష్టి సారించారు. గురువారం ఓటర్లను చైతన్య పరిచి పోలింగ్ బూత్‌ల వద్దకు వచ్చేలా చేయాలని అభ్యర్థులు, వారి అనుచరులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మొత్తం 3 లక్షల 47 వేల 116 మంది ఓటర్లున్న దృష్ట్యా పోలింగ్ శాతం ఎంత పెరిగితే అంత తమకు మేలు జరుగుతుందని కూటమి నేతలు భావిస్తున్నారు. అయితే గత ఎన్నికల్లో వేల సంఖ్యలో ఓట్లు చెల్లుబాటు కాకుండా పోయాయి. ఈ దృష్ట్యా పోలింగ్ శాతం పెరిగినా అవి వ్యాలిడ్ ఓట్లు అయితేనే మేలు జరుగుతుంది.

సజావుగా డిస్ట్రిబ్యూషన్ జరగాలి

డిస్ట్రిబ్యూషన్ కౌంటర్ల వద్ద రద్దీ లేకుండా సజావుగా ఎన్నికల సామగ్రిని సిబ్బందికి అందించాలని రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. పోలింగ్ మెటీరియల్ సరిచూసుకున్న సిబ్బందిని సురక్షితంగా రూట్ల ప్రకారం పోలింగ్ స్టేషన్లకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. గుంటూరులోని ఏసీ కళాశాలలో రిసెప్షన్ సెంటర్లు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ ఏర్పాట్లను మంగళవారం ఆమె సంయుక్త కలెక్టర్ భార్గవ్‌తేజ, తెనాలి సబ్‌కలెక్టర్ సంజనాసిన్హాలతో కలిసి పరిశీలించారు. ప్రధానంగా డిస్ట్రిబ్యూషన్ కౌంటర్ల వద్ద సైనేజ్ బోర్డులను ఎన్నికల సిబ్బంది గుర్తించేలా ఉండాలన్నారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కౌంటర్ల వద్ద ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి అల్పాహారం, మంచినీరు, శుచి శుభ్రమైన భోజనాలు అందించేందుకు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి తగు సూచనలు అందించారు. గురువారం ఓటింగ్ అనంతరం పోలింగ్ బూత్‌ల నుంచి తీసుకువచ్చిన బ్యాలెట్ బాక్సులను నిబంధనల ప్రకారం సురక్షితంగా భద్రపరచేందుకు గదులను పరిశీలించారు. ఏసీ కాలేజీలోని ప్రేయర్ హాల్‌లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ టేబుళ్లను పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు ఆర్‌డీవో కే శ్రీనివాసరావు, గుంటూరు తూర్పు, పశ్చిమ మండల తహసీల్దార్లు నగేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మద్యం అమ్మకాలు బంద్

గుంటూరు(కార్పొరేషన్): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బుధ, గురువారాల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా మద్యం అమ్మకాలు నిలిపివేస్తున్నట్లు ఎక్సైజ్ డీసీ డాక్టర్ కే శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం సాయంత్రమే వైన్‌షాపులకు, బార్లకు తాళాలు వేసినట్లు తెలిపారు. ఆయా బార్లు, వైన్‌షాపుల్లో రెండు రోజుల పాటు మద్యం అమ్మకాలను పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో వచ్చే నెల 3న కూడా మద్యం విక్రయాలను నిషేధించినట్లు తెలిపారు.

ఇన్‌చార్జ్‌ల పాలన

- ఎన్జీ రంగా వర్సిటీపై ప్రభుత్వం నిర్లక్ష్యం
- ఆర్థిక శాఖ అనుమతి లేకుండానే నియామకాలు
- ఏడాదిగా అతీగతి లేని పాలకవర్గం నియామకం
- రాష్ట్ర విభజన తర్వాత మంజూరు కాని పోస్టులు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వైస్ చాన్సలర్, కంప్ట్రోలర్, అగ్రికల్చర్, ఇంజనీరింగ్, కమ్యూనిటీ సైన్సు, స్టూడెంట్స్ ఎఫైర్స్ డీన్లు, రీసెర్చ్, ఎక్స్‌టెన్షన్ డైరెక్టర్లు, రిజిస్ట్రార్, కంప్ట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్.. ఇలా ఒకటి కాదు రెండు కాదు కీలకమైన మొత్తం పోస్టుల్లో ఇన్‌చార్జిలే దిక్కు. ఇదీ గత కొన్నేళ్లుగా ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ యూనివర్సిటీలో జరుగుతున్న ఇన్‌చార్జిల పాలన. ఇన్‌చార్జిల పాలనతో అనేక నష్టాలు జరుగుతున్నా ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించడంలేదు. వర్సిటీకి చెందిన రూ.400 కోట్ల బడ్జెట్ వ్యవహారాలు ఇన్‌చార్జి కంప్ట్రోలర్ చూస్తున్నారంటే ఏం జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. గత ప్రభుత్వం యూనివర్సిటీని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. రాష్ట్ర విభజన తర్వాత ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీకి ఒకటి రెండు పోస్టులు మాత్రమే వచ్చాయి. మిగిలిన వాటిని ప్రభుత్వం కొత్తగా మంజూరు చేయాలి. వాటికి హయ్యర్ ఎడ్యుకేషన్, ఆర్థిక శాఖ అనుమతి ఇవ్వాలి. ఆ తదుపరి పూర్తిస్థాయిలో నోటిఫికేషన్ విడుదల చేసి అర్హులను నియమించాలి. కానీ ఆచార్య ఎన్జీ రంగా వర్సిటీలో ఈ ఏర్పాటు లేకుండానే పనులు సాగుతున్నాయి. ఎప్పటికప్పుడు తాత్కాలిక పద్ధతిలో చేపడుతున్న నియామకాలు వివాదాస్పదంగా మారుతున్నాయి.



ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీ

మూడు నెలలే...

ప్రస్తుతం ఉన్న కీలకమైన పోస్టులన్నీ మూడు నెలల తాత్కాలిక పద్ధతిపై(రీ డిప్లాయ్‌మెంట్) భర్తీ చేస్తున్నారు. వీసీకి అనుగుణంగా ఉన్న వారిని నియమించడం ఆనవాయితీగా మారింది. గవర్నర్‌తో పనిలేకుండా ఆయా పోస్టుల్లో మూడు నెలలకి ఒకసారి నియామకం చేస్తున్నట్లు తెలుస్తోంది. అన్ని రకాలుగా ప్రాబల్యం ఉన్న వారికి మాత్రమే కీలక పోస్టులు దక్కుతున్నాయన్న వాదన ఉంది. గత ప్రభు త్వంలో పూర్తిగా ఒక పార్టీకి, ఒక వర్గానికి చెందిన వారికి మాత్రమే ప్రాధాన్యం దక్కిందన్న ఆరోపణలున్నాయి.

వివాదాలు..

వర్సిటీలోని కీలకమైన పోస్టుల్లో ఇన్‌చార్జిలే ఉండటంపై తీవ్రవివాదం నెలకొంది. ఇప్పటికే పలు ఆరోపణలు వస్తుండటం.. కొందరు ఈ విషయాలను గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలుస్తుంది. రెన్యూవల్ పద్ధతికి స్వస్తి పలికి శాశ్వత నియామకాలు చేపట్టాలన్న డిమాండ్ వస్తోంది. ఖాళీగా ఉన్న పోస్టులకు నోటిఫికేషన్ విడుదలతో అర్హులకు న్యాయం జరుగుతుందన్న అభిప్రాయం ఉంది. వ్యవసాయ రంగంలో కీలకపాత్ర పోషించే ఎన్జీ రంగా వర్సిటీకి ప్రభుత్వం తరపున ప్రాతినిధ్యం వహించేందుకు పాలకవర్గం లేకపోవడం గమనార్హం. ఏడాదిగా బోర్డు ఏర్పాటు కాలేదు. బోర్డు నియామకంపై త్వరితగతిన చర్యలు చేపట్టాలన్న సూచనలు వస్తున్నాయి.

34 రోజులు.. రూ.304 కోట్లు

- ఆస్తిపన్ను వసూళ్లలో రెవెన్యూ అధికారుల ముందున్న లక్ష్యం



- ఉమ్మడి జిల్లా మునిసిపాలిటీల్లో వసూళ్లు అంతంతమాత్రమే..
- ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా దరిచేరని లక్ష్యం
- ఇప్పటికీ 70 శాతం దాటని వసూళ్లు..
- వినుకొండలో అత్యధికంగా... చిలకలూరిపేటలో అత్యల్పంగా..
- ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసినా ప్రయోజనం శూన్యం

6

రెప్పపాటులో రెండు ప్రాణాలు బలి

- ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన లారీ
- తల్లీ కూతురు దుర్మరణం

6

గుంటూరు, బాపట్ల సర్కిల్స్ ఎస్ఈల నియామకం

- ఈఈల ఉద్యోగోన్నతితో ఇన్‌చార్జ్‌ల పాలనకు తెర

6

వరుసగా రెండో ఏడాది మూడు మిలియన్ టన్నుల సరుకు రవాణా



ఆటోనగర్‌లోని విత్తనాల ప్రాసెసింగ్ యూనిట్లను తనిఖీ చేస్తున్న ఏడీ ఏ లు శ్రీనివాసరావు, సుదర్శన్ రాజు తదితరులు

ఆటోనగర్‌లో వ్యవసాయశాఖ తనిఖీ

● విత్తనాల ప్రాసెసింగ్‌యూనిట్ల పరిశీలన.. ఎగుమతులపై ఆరా

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని ఆటోనగర్‌లో వ్యవసాయశాఖ విస్తృత తనిఖీలు నిర్వహించింది. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'నకిలీ విత్తనాల అడ్డా.. ఆటోనగర్' అనే శీర్షికతో ప్రచురితమైన వార్తపై వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయం స్పందించింది. జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు నేతృత్వంలో మూడు బృందాలుగా అధికారులు ఆటోనగర్‌లోని 10 విత్తనాల ప్రాసెసింగ్ యూనిట్లను తనిఖీ చేశారు. జూట్ ఎగుమతి అనుమతి పొందిన రెండు ప్రాసెసింగ్ యూనిట్ల అనుమతి పత్రాలను పరిశీలించి ప్రభుత్వ అనుమతి ఉన్నట్లు గుర్తించారు. నేషనల్ సీడ్ కార్పొరేషన్ యూనిట్ నుంచి 5200 క్వింటాళ్ల జూట్ విత్తనాల, తేజస్వి సీడ్స్‌కు 1072 క్వింటాళ్ల జూట్ విత్తనాల ఎగుమతికి అనుమతులు గుర్తించారు. మినుము, కంది, పెసర వంటి విత్తనాలు ప్రాసెసింగ్ చేస్తున్న యూనిట్లను పరిశీలించారు. పత్తి విత్తనాలు ప్రాసెసింగ్ ఆరంభం కాలేదని గుర్తించారు. నగరంలోని ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలను అధికారులు తనిఖీలు చేశారు. తనిఖీల్లో ఏడీఏలు సుదర్శన్ రాజు, తోటకూర శ్రీనివాసరావు, కె.అన్నపూర్ణమ్మ, ఐ.సునీత, ఏవోలు సునీల్‌కుమార్, గౌతమ్‌ప్రసన్న, ఖడ్గం రమణకుమార్, పాల్గొన్నారు.

కుడి కాలువలో గల్లంతైన వ్యక్తి మృతి

దుర్గి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడిగొప్పుల వద్ద నాగార్జునసాగర్ కుడికాలువలో ఈతకు దిగి గల్లంతైన గుట్టపల్లి అయ్యప్ప(28) మృతదేహం నకరికల్లు మండలం గుళ్లపల్లి వద్ద మంగళవారం లభ్యమైంది. నరసరావుపేట ఎన్జీవోకాలనీకి చెందిన అయ్యప్ప ఆదివారం మండలంలోని అడిగొప్పులలో నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారిని దర్శించుకొని తిరిగి వెళ్తూ మార్గమధ్యంలోని అడిగొప్పుల కుడి కాలువలో ఈతకు దిగి గల్లంతయ్యాడు. సమాచారం తెలుసుకున్న దుర్గి ఎస్ఐ సుధీర్‌కుమార్ గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని వెలికి తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

34 రోజులు.. రూ.304 కోట్లు

● ఆస్తిపన్ను వసూళ్లలో రెవెన్యూ అధికారుల ముందున్న లక్ష్యం
● ఉమ్మడి జిల్లా మునిసిపాలిటీల్లో వసూళ్లు అంతంతమాత్రమే..
● ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా దరిచేరని లక్ష్యం
● ఇప్పటికీ 70 శాతం దాటని వసూళ్లు..
● వినుకొండలో అత్యధికంగా... చిలకలూరిపేటలో అత్యల్పంగా..
● ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసినా ప్రయోజనం శూన్యం



గుంటూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మార్చి 31వ తేదీ నాటికి 2024-25 ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఉమ్మడి గుంటూరు జిల్లా మున్సిపాలిటీలలో ఆస్తిపన్ను వసూలుకి ఇక కేవలం 34 రోజులు వ్యవధి మాత్రమే ఉంది. ఇప్పటివరకు రూ.202 కోట్లు మాత్రమే వసూలు కాగా, ఇంకా రూ.304 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ప్రతి రోజు రూ 8.90 కోట్ల వసూలు చేస్తేనే 34 రోజుల్లో మొత్తం ఆస్తి పన్ను వసూలు సాధ్యమవుతుంది. లేకుంటే ఈ ఆర్థిక ఏడాది లక్ష్యం నెరవేరనట్లే అవుతుంది.

పన్ను వసూళ్లలో చతికిలపడ్డ యంత్రాంగం..

ఆస్తిపన్ను వసూళ్లలో మున్సిపాలిటీలలోని రెవెన్యూ యంత్రాంగం పూర్తిగా సతికలపడింది. పన్ను వసూళ్లకు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి, కమిషనర్లు సైతం రంగంలోకి దిగినప్పటికీ ఆశించిన మేరకు వసూలు జరగటం లేదు. ప్రభుత్వ ప్రైవేటు బకాయిలను వసూలు చేసేందుకు ప్రతి ఏడాది మార్చిలో మాత్రమే అధికారులు హడావుడి చేస్తుంటారు. అంతకుముందు కాలంలో వసూళ్లపై దృష్టి కేంద్రీకరణ ఉండదు. నామమాత్రంగానే పని చేస్తుంటారు. మున్సిపాలిటీల్లో పన్ను బకాయిలు పేరుకు పోవడానికి కేవలం ఆయా మున్సిపాలిటీలలోని రెవెన్యూ అధికారుల బాధ్యతా రాహిత్యమే నిదర్శనంగా నిలుస్తోంది.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్న మున్సిపాలిటీల సంఖ్య	:	14
14 మున్సిపాలిటీలలో ఉన్న మొత్తం అసెస్మెంట్ నెంబర్ల సంఖ్య	:	5,37,538.
మున్సిపాలిటీలలో ఉన్న ఆస్తిపన్ను డిమాండ్	:	రూ.506,40,62,131.
ఇప్పటివరకు మున్సిపాలిటీలలో వసూళ్లు చేసిన ఆస్తి పన్ను	:	రూ. 202,40,45,840.
14 మున్సిపాలిటీలలో మిగిలి ఉన్న బ్యాలెన్స్ అమౌంట్ మొత్తం	:	రూ.304,00,16,291

వినుకొండలో అత్యధికంగా వసూళ్లు..

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 14 మున్సిపాలిటీలలో వినుకొండ మున్సిపాలిటీలో ఆస్తిపన్ను వసూళ్లు అత్యధికంగా జరిగాయి. ఆ మున్సిపాలిటీలో మొత్తం 15,730 అసెస్మెంట్ నెంబర్లు ఉండగా, అందులో రూ.6.30 కోట్లు ఆస్తిపన్ను డిమాండ్ ఉంది. దీనిలో రూ.5 కోట్లు వసూలు చేశారు. ఇక కేవలం రూ.1.29 కోట్లు పెండింగ్ ఉంది. చిలకలూరిపేట మున్సిపాలిటీ అత్యల్పంగా పన్ను వసూలు జరిగాయి. మొత్తం అసెస్మెంట్ నెంబర్లు 32,622 కాగా, అందులో ఆస్తిపన్ను డిమాండ్ రూ.22.39 కోట్లు ఉంది. దీనిలో కేవలం రూ.6.40 కోట్లు మాత్రం వసూలు చేశారు. ఇంకా రూ.15.99 కోట్లు బకాయి ఉంది. మిగిలిన 12 మున్సిపాలిటీలలోనూ వసూళ్లు అంతంత మాత్రంగానే ఉన్నాయి.

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 14 మున్సిపాలిటీలలో ఆస్తిపన్ను వసూలు సగటున 70 శాతం కూడా దాటలేదు. మాచర్ల, నరసరావుపేట మున్సిపాలిటీలలో 42 శాతం, బాపట్లలో 42 శాతం, రేపల్లెలో 56.52 శాతం, పొన్నూరులో 56.93 శాతం, తెనాలిలో 51.53 శాతం, దాచేపల్లిలో 56.53 శాతం, గురజాలలో 55.47 శాతం, పిడుగురాళ్లలో 59.72 శాతం, సత్తెనపల్లిలో 35.19 శాతం మాత్రమే వసూలు అయ్యాయి.

గుంటూరులో కేవలం 33 శాతం మాత్రమే..

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తిపన్ను వసూళ్లు అధ్వానంగా ఉన్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో గుంటూరు, మంగళగిరి తాడేపల్లి మున్సిపాలిటీలు కార్పొరేషన్ నగరాలుగా ఉన్నాయి. అందులో గుంటూరులో ఇప్పటివరకు కేవలం 33.31 శాతం వసూలు మాత్రమే ఉంది. వాస్తవానికి జీఎంసీ పరిధిలో పెద్ద ఎత్తున రెవెన్యూ సిబ్బంది వివిధ కేటగిరీలలో పనిచేస్తున్నారు. అయినప్పటికీ వసూళ్లు అధ్వానంగా ఉన్నాయి. మంగళగిరి తాడేపల్లి మున్సిపాలిటీ పరిధిలో 66.93 వసూళ్లయ్యాయి. గుంటూరు కార్పొరేషన్ పరిధిలో మాత్రం ఆశించిన మేరకు జరగటం లేదనేది వాస్తవం.


సమావేశంలో మాట్లాడుతున్న ఆలపాటి రాజేంద్రప్రసాదు, పక్కన ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, నసీర్ అహమద్, జనసేన, బీజేపీ నేతలు

పట్టభద్రులారా.. ప్రగతికి ఓటెయ్యండి !

● కృష్ణా-గుంటూరు ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): విజ్ఞతతో ఆలోచించి ప్రగతికి ఓటెయ్యాలని పట్టభద్రులకు గుంటూరు-కృష్ణా ఉమ్మడిజిల్లాల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాదు విజ్ఞప్తి చేశారు. గుంటూరు, లక్ష్మీపురంలో ఆయన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుస్థిర పాలనకు మద్దతు ఇవ్వాలని కోరారు. 33 నియోజకవర్గాల్లో పర్యటించి సమస్యలను తెలుసుకున్నానని, ఆ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పుడిప్పుడే రాష్ట్రం సంక్షేమ బాట పడుతుందని ఈ సమయంలో ఓటర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రశ్నించే గొంతుకలు సరైన సమయంలో మూగబోతుంటాయని, నామమాత్రపు ఉద్యమాలతో ఫలితాలేవీ రావని విమర్శించారు. సారవంతమైన భూములు, పరిశ్రమల ద్వారా ఉపాధి కల్పించే ఈ ప్రాంతాన్ని గత పాలకులు నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. 20 లక్షల ఉద్యోగాల కల్పనతో పాటు ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానన్నారు. ప్రత్తిపాడు, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, నసీర్ అహమద్‌లు మాట్లాడుతూ 40ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్ర కల్గిన ఆలపాటిని గెలిపించాలని కోరారు. చంద్రబాబు సమర్థతతో ఎనిమిది నెలల కాలంలోనే ప్రజల తలసరి ఆదాయం పెరిగిందని, ఉపాధి అవకాశాలు మెరుగైయ్యాయన్నారు. రాష్ట్రంలో ప్రగతి సాధించాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో బీజేపీ, జనసేన గుంటూరుజిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరపతిరావు, గాదె వెంకటేశ్వర్లు, మాజీ మంత్రి శనక్కాయల అరుణ, బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్, సోమిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మణస్వామి, వేదికపై డాక్టర్ కొల్లి శారద

ఘనంగా శ్రేష్ఠ హాస్పిటల్స్ ప్రథమ వార్షికోత్సవం

● ముఖ్య అతిథిగా హాజరైన గుంటూరు మాజీ మేయర్ డాక్టర్ కొల్లి శారద

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): శ్రేష్ఠ హాస్పిటల్స్ ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం గుంటూరు నగరంలోని హాస్పిటల్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి వైద్యులు, సిబ్బందితో పాటు గత ఏడాదిలో ఆస్పత్రిలో చికిత్సలు పొందిన రోగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన గుంటూరు నగర మాజీ మేయర్ డాక్టర్ కొల్లి శారద మాట్లాడుతూ అమెరికా, లండన్ వంటి దేశాల్లోని ఆస్పత్రులకు ఏ మాత్రం తీసిపోకుండా శ్రేష్ఠ హాస్పిటల్స్‌లో ఆధునిక సౌకర్యాలు, అత్యాధునిక చికిత్సలు ఉన్నాయన్నారు. రోగులకు ఉత్తమ వైద్య చికిత్సలు అందిస్తున్నారని వైద్యులను అభినందించారు. శ్రేష్ఠ హాస్పిటలో చికిత్స పొందిన పీ రామ చంద్రరాజు మాట్లాడుతూ ఎంతో క్లిష్ట పరిస్థితుల్లో హెర్నియా ఆపరేషన్ కోసం శ్రేష్ఠ హాస్పిటల్స్‌కు వచ్చానని, ఇక్కడ అధునాతన చికిత్సలతో త్వరగా కోలుకున్నానని, వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది ఎంతో ఆప్యాయతగా చూసుకున్నారని ఆనందం వ్యక్తం చేశారు. అలాగే పర్రెపాటి సురేష్, పురుషోత్తం, భాస్కరరావు తదితరులు మాట్లాడతూ వారు ఆస్పత్రిలో పొందిన వైద్యసేవలను వివరిస్తూ వైద్యులను ప్రశంసించారు. కార్యక్రమంలో శ్రేష్ఠ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ వై లక్ష్మణస్వామి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గొట్టిపాటి నాగార్జున పాల్గొన్నారు.

రెప్పపాటులో రెండు ప్రాణాలు బలి

● ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన లారీ
● తల్లీ, కూతుళ్లు దుర్మరణం.. ఛిద్రమైన దేహాలు
● గతంలో తండ్రి మృతి.. నేడు అమ్మ, చెల్లి..
● అనాథగా మిగిలిన కుమారుడు

గుంటూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : లారీ డ్రైవరు నిర్లక్ష్యం రెండు ప్రాణాలను బలి తీసుకుంది. గుంటూరు అమరావతి రోడ్డులోని చిల్లీస్ రెస్టారెంట్ సమీపంలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లి, కూతురు అక్కడికక్కడే మృతి చెందారు. నల్లపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు నగరంలోని రాజీవ్‌గాంధీనగర్ 6/5కి చెందిన విజమూరి పుల్లయ్య, నాగమణి(45) దంపతులకు కుమారుడు గోపీచంద్ (24), కుమార్తె చరణ్య(14) సంతానం ఉన్నారు. పుల్లయ్య అనారోగ్యంతో 2014లో మృతిచెందాడు. అప్పటినుంచి నాగమణి టైలరింగ్ చేస్తూ ఇద్దరు పిల్లలను చదివిస్తోంది. గోపీచంద్ బీటెక్ పూర్తిచేసి విజయవాడలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. కూతురు చరణ్య తొమ్మిదో తరగతి చదువుతోంది. వీరికి అడవి తక్కెళ్ళపాడులో టిడ్కో ఇల్లు ఉంది. గోపీచంద్ 24న రాత్రి విజయవాడలో పని ముగించుకుని అడవి తక్కెళ్ళపాడులోని టిడ్కో నివాసానికి వెళ్లాడు. మంగళవారం ఉదయం 6 గంటలకు తల్లి నాగమణి, కూతురు చరణ్యలు రాజీవ్‌గాంధీ నగర్‌లోని ఇంటి నుంచి బయలుదేరి గోపీచంద్‌ను కలిసేందుకు స్కూటీపై అడవి తక్కెళ్ళపాడులోని టిడ్కో నివాసానికి వెళ్లారు. అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. అమరావతి రోడ్డు నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు రెడ్డిపాలెం వెళ్లే వైపు యూటర్న్ తీసుకునేందుకు ప్రయత్నిస్తుం డగా ఆ సమయంలో నగరాలు వైపు నుంచి అమరావతి వైపు అతివేగంగా వచ్చిన లారీ వారి ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. నాగమణి, చరణ్యలు రోడ్డుపై పడ్డారు. వారి మీదుగా లారీ ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందారు. లారీ డ్రైవర్ పరారయ్యాడు. సమాచారం అందుకున్న నల్లపాడుసీఐ వంశీధర్, ఎస్ఐ నాగరాజు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను గుంటూరు జీజీహెచ్‌కి తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. గతంలో తండ్రి, ఇప్పుడు తల్లి,చెల్లి మృతి చెంద టంతో కుమారుడు గోపీచంద్ ఒంటరి వాడయ్యాడు.


అవార్డును అందుకుంటున్న భాష్యం సాకేతరామ్

భాష్యం బ్లూమ్స్‌కు ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ 2024-25 అవార్డు

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్-ఎంపవరింగ్ ఇండియా 3వ ఎడిషన్ ప్రకటించిన ఫలితాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున భాష్యంబ్లూమ్స్ పాఠశాల సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్ అవార్డును కైవసం చేసుకున్నట్లు భాష్యం విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ తెలిపారు. ఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో విద్యాశాఖ సహాయ మంత్రి డాక్టర్ సుకాంత మజుందార్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ దీపక్ వర్మ పాల్గొని అవార్డును ప్రదానం చేసినట్లు తెలిపారు. విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు ఉత్తమమైన విద్యనందించేందుకు భాష్యం బ్లూమ్స్ నిర్విరామంగా కృషిచేస్తుందని సాకేత్‌రామ్ అన్నారు. కార్యక్రమంలో భాష్యం బ్లూమ్స్ జెడ్ఈఓ వరలక్ష్మి, అకడమిక్ కౌన్సిల్ అడ్వైజర్‌రాజా, బ్లూమ్స్ ప్రిన్సిపాల్స్ కవిత, గిరిజారాణిలు పాల్గొన్నారు.

వరుసగా రెండో ఏడాది
3 మిలియన్ టన్నుల సరుకు రవాణ

గుంటూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వరుసగా రెండో ఏడాది కూడా 3 మిలియన్ టన్నుల సరుకును గుంటూరు రైల్వే డివిజన్ నుంచి రవాణ చేసినట్లు డీఆర్ఎం ఎం.రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతేడాది ఈ మైలు రాయిని మార్చి 2న సాధించగా ఈ సంవత్సరం ఫిబ్రవరి 24వ తేదీకే సాధించామన్నారు. పటిష్టమైన ప్రణాళిక, సిబ్బంది అంకిత భావం, టీంవర్కుతోనే ఈ ఘనత సాధ్యమైందన్నారు. కమర్షియల్, ఆపరేటింగ్ విభాగాల అధికారులు ఎం దినేష్‌కుమార్ (సీనియర్ డీపీఎం), సీహెచ్ ప్రదీప్‌కుమార్(సీనియర్ డీసీఎం)లను అభినందించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరికొన్ని విజయాలను డివిజన్ సాధించిందని తెలిపారు. వాటిల్లో గత ఏడాదితో పోలిస్తే డివిజన్‌లో రైళ్లు, గూడ్స్‌ల వేగం 20 శాతం పెరిగిందన్నారు. రోలింగ్ బ్లాక్ కారిడార్ ప్రోగ్రాంలో 95.91 శాతం బ్లాక్‌లు మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. ఇప్పటివరకు డివిజన్ మొత్తం 100 లాంగ్ హాల్స్(పొడవాటి గూడ్స్ రైళ్లు) ఏర్పడ్డాయన్నారు. ఈ ఏడాదిలో రైళ్ల సమయపాలన 88.59 శాతంగా నమోదైందన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

బొల్లాపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూగ చింతలపాలెం గ్రామానికి చెందిన రైతు పీ.నాగేశ్వరరావు(48) విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. నాగేశ్వరరావు పొగాకు చెక్కులను ట్రాక్టర్‌లో లోడు చేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంటు తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ బాలకృష్ణ ఘటనా స్థలానికిచేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, అనంతరం పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య, పిల్లలు రోదిస్తున్న తీరు చూపరులను కంట తడి పెట్టించింది.

గుంటూరు, బాపట్ల సర్కిల్స్ ఎస్ఈల నియామకం

● ఈఈలకు ఎస్ఈల ఉద్యోగోన్నతితో ఇన్‌చార్జిల పాలనకు తెర...

గుంటూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థలో గుంటూరు, బాపట్ల సర్కిల్స్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌లుగా కొనసాగుతున్న కేవీఎల్ఎన్ మూర్తి, జి.ఆంజనేయులుతో పాటు ఒంగోలు సర్కిల్‌కు కె.వెంకటేశ్వర్లును పూర్తిస్థాయి ఆపరేషన్ ఎస్ఈలుగా నియమిస్తూ సంస్థ జీఎండీ ఐకేవీ భాస్కర్ మంగళవారం రాత్రి నియామకపు ఉత్తర్వులు విడుదల చేశారు. కేవీఎల్ఎన్ మూర్తిని గుంటూరు సర్కిల్‌కు, జీ ఆంజనేయులని బాపట్ల సర్కిల్‌కు, కె.వెంకటేశ్వర్లును ఒంగోలు సర్కిల్‌కు ఇన్‌చార్జిలుగా ఉన్నారు. ఈనెల 22న ఈఈలకు ఎస్ఈలుగా ఉద్యోగోన్నతి కల్పించటంతో ఆ జాబితాలో ఉన్న కేవీఎల్ఎన్ మూర్తి, ఆంజనేయులు, కె వెంకటేశ్వర్లు ఎస్ఈలుగా నియామకం పొందారు. ఇక ఎస్ఈలుగా ఉద్యోగోన్నతి పొందిన జాబితాలో ఉన్న గుంటూరు టౌన్-2 ఈఈగా వ్యవహరిస్తున్న సీహెచ్ రమేష్, ఎం.శ్రీనివాసరావు (గుంటూరు కన్‌స్ట్రక్షన్స్)ను విజయవాడలోని కార్పొరేట్ కార్యాలయానికి ఎస్ఈలుగా బదిలీ చేశారు. గతంలో గుంటూరు టెక్నికల్ ఈఈగా, ప్రస్తుతం పల్నాడు ఎమ్ఆర్‌టీ సెక్షన్ ఈఈగా వ్యవహరిస్తున్న జె శ్రీనివాసులరెడ్డిని కూడా విజయవాడ కార్పొరేట్ కార్యాలయానికి బదిలీ చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.85 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	78, 85, 95
చికెన్ విత్ స్కిన్	150.00
చికెన్ స్కిన్ లెస్	160.00

అంతర్జాతీయ స్కేటింగ్ పోటీలకు హసిష్



తాడేపల్లిటౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తైవాన్‌లో చైనీస్ తైపీ రోలర్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మార్చి 24 నుంచి 30 వరకు జరిగే అంతర్జాతీయ స్కేటింగ్‌పోటీలకు మన దేశం తరఫున గుంటూరుజిల్లా తాడేపల్లి డోలాస్‌నగర్‌కు చెందిన మెరుగుపాల హసిష్ ఎంపికయ్యారు. ఫెడరేషన్ అధ్యక్షుడు లీయూహు - త్సాయ్ ఈ మేరకు ఉత్తర్వులు పంపారు. హసిష్ ఆర్టిస్ట్ స్కేటింగ్ విభాగంలో ఫ్రీస్టయిల్ ఇన్‌లైన్, సోలోడాన్స్ పోటీల్లో తలపడతాడు. గత ఏడాది డిసెంబరులో తమిళనాడులోని పొలాచ్చిలో రోలింగ్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో ప్రథమస్థానంతో బంగారు పతకం సాధించారు. ఆ అర్హతతోనే తైవాన్ అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. కోచ్ పి.సత్యనారాయణ, చిట్టిబాబు, ఆంధ్రప్రదేశ్ రోలర్ స్కేటింగ్ కార్యదర్శి పి.థామస్, గుంటూరు రోలర్ స్కేటింగ్ అధ్యక్ష, కార్యదర్శులు సి.నీలిమ, పి.శ్రీకాంత్‌లు హర్షం వ్యక్తం చేశారు.

1,26,285 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,19,894 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,26,285 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 63,478 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			షార్క్-1	11500	13000
334	9000	14000	బ్యాడిగి 355	10000	14000
నంబరు. 5	10500	14000	సింజెంటా		
273	10000	13000	బ్యాడిగి 5531	10000	12500
341	10000	14300	ఎస్ఎస్ 250		
4884	9500	13000	బుల్లెట్	--	--
సూపర్ 10	--	--	దేవనూరు డీలక్స్	11500	13500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఆర్మూరు	10000	11500
తేజ	10000	14200	తాలుకాయలు	5000	7500

27, 28 తేదీల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం

గుంటూరు (కార్పొరేషన్), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బీఆర్ స్టేడియం రిజర్వాయర్ పరిధిలో తాగునీటి సరఫరా జరిగే పాత 600 ఎంఎం డయా ఔట్లెట్ ఆర్సీసి డిస్ట్రిబ్యూషన్ పైప్ లైన్ మరమ్మతు పనులు చేసేందుకు ఇంజినీరింగ్ అధికారులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారని, పనుల వలన 27న సాయంత్రం నుంచి 28వ తేదీ వరకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగు తుందని కమిషనర్ పులి శ్రీనివాసులు మంగ ళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ, రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని బీఆర్ స్టేడియం రిజర్వాయర్ పరిధిలోని పైప్ లైన్ మరమ్మతు పనులను చేపట్టడం జరుగుతుందని, పనుల వలన పాతగుంటూరు, ముగ్దూం నగర్, విజయశాంతి నగర్, భగత్ సింగ్ నగర్, నాగాలక్ష్మీ నగర్, యానాది కాలనీ, దుర్గా నగర్, ప్రియాంక గార్డెన్స్, ఆనందపేట జీరో లైన్, గౌడ కాలనీ, జీకె నగర్, ఎల్బీ నగర్, అలీ నగర్, లాల్ జాన్ బాషా షాదీ ఖానా ప్రాంతం, సంగడిగుంట, లాంచెస్టర్ మెయిన్ రోడ్ తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని, తిరిగి మార్చి 1వ తేదీ ఉదయం నుంచి యధావిధిగా సరఫరా జరుగుతుందని తెలిపారు.

ముగిసిన అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): గుంటూరు చౌత్ర సెంటర్‌లో గల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న జ్ఞానజ్యోతి మొదటి దశ ఆరు రోజులు శిక్షణా కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి. విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రైవేటు ప్లే స్కూల్‌కు ధీటుగా ప్రభుత్వ విద్యాశాఖ అంగన్వాడీ కేంద్రాలు విద్యార్థులను తీర్చిదిద్దడానికి విద్యాశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు ఈ శిక్షణ నిర్వహించబడుతుందన్నారు. ఎంఈఓ అబ్దుల్ ఖుదూస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎండీ ఖాసిం, డీఆర్పీలు శైలజ, అనురాధ, పద్మలత తదితరులు పాల్గొన్నారు

పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ డీఎంగా సవరమ్మ

గుంటూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ జిల్లా మేనేజర్‌గా టీ సవరమ్మని ప్రభుత్వం నియమించింది. గత నెల 11వ తేదీన జరిగిన డిప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో సవరమ్మని కూడా ప్రభుత్వం ట్రాన్స్‌ఫర్ చేసింది. ఇప్పుడు ఆమెకు పోస్టింగ్ కల్పిస్తూ మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఒకటి నుంచి మహా కుంభాభిషేకాలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ అష్టబంధన మహా సంప్రోక్షణ సహిత మహాకుంభాభిషేక మహోత్సవాలు మార్చి 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఆహ్వాన పత్రికలను మంగళవారం ఆయన ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, బొల్లేపల్లి సత్యనారాయణ, లంకా విజయబాబు, పుట్టా ప్రభాకర్‌రావు, ఆలయ అర్చకులు మాధవస్వామి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో మహాశివరాత్రి సందర్భంగా చండీహోమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. అన్నమయ్య కళావేదికపై ప్రముఖ సాహితీవేత్త గుదిమెళ్ళ శ్రీకూర్మనాథస్వామి మహాభారతంలోని అరణ్య పర్వంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు.

శిల్పారామం అభివృద్ధికి కార్యచరణ

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): శిల్పారామం అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నామని ఏపీ శిల్పారామం ఆర్ట్స్, క్రాఫ్ట్స్ అండ్ కల్చరల్ సొసైటీ చైర్మన్ మంజులారెడ్డి అన్నారు. ఇన్నర్ రింగురోడ్డులోని శిల్పారామాన్ని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుతో కలిసి ఆమె సందర్శించారు. మంజులారెడ్డి మాట్లాడుతూ పర్యాటక ప్రాంతంగా శిల్పారామాన్ని తీర్చిదిద్దుతామన్నారు. బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ నగరపాలక సంస్థ అధికారులతో మాట్లాడి శిల్పారామం చుట్టూ ప్రహరీ నిర్మిస్తామని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఈరంటి వరప్రసాదు, ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిశీలకులు సొమిశెట్టి వెంకటేశ్వరరావు, ఏవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ నాయకుల ధర్నా

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థలో పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు కోట మాల్యాద్రి డిమాండ్ చేశారు. కార్పొరేషన్ ఎదుట పారిశుధ్య కార్మికులతో మంగళవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు రావుల అంజిబాబు, ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి చల్ల మరియదాసు, కోటి వీరాంజనేయులు బట్టు సద్గుణరావు, మిరియాల కోటేశ్వరరావు, ఎలీషా రావు, ఏకుల సుబ్రహ్మణ్యం, దాసరి శివయ్య మంగమ్మ, సువార్త, బాలమ్మ, లక్ష్మి, వీరమ్మ, బుజ్జి, తిరుమల, భూలక్ష్మి రూతు, శంకర్ తదితరులు పాల్గొన్నారు

పశు వైద్య విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): హ్యూమన్ వైద్య విద్యార్థులతో సమానంగా పశు వైద్య విద్యార్థులకు స్టైఫండ్ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. కొత్తపేట పశువుల ఆస్పత్రిలో సమ్మె చేపట్టిన విద్యార్థులకు మద్దతు తెలిపి ఆయన మాట్లాడారు. నిరసనల్లో రంగారెడ్డి, శివాజీ, కంజుల విఠల్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని ఇంజనీరింగ్ అధికారులు

● మస్తాన్ దర్గా వెనక రోడ్డులో కొంత భాగం సీసీ రోడ్డు

● దాంతో గతంలో నిర్మించిన డివైడర్ కనుమరుగు

● మిగతా భాగంలో మెటల్ రోడ్డు స్లోప్‌ని సరిగా చేయని కార్పొరేషన్



మస్తాన్ దర్గా వెనక రోడ్డులో కొంత భాగం మెటల్ రోడ్డు ఉన్న చిత్రం

గుంటూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రోడ్ల నిర్మాణం విషయంలో ఇంజనీరింగ్ నిబంధనలను ఏమాత్రం పాటించడం లేదు. ఇష్టారాజ్యంగా రోడ్లపై రోడ్లు, ఒక మార్గంలో కొంత భాగం సీసీ రోడ్డు, మిగతా భాగం మెటల్ రోడ్డు, అలానే డ్రెయిన్ టూ డ్రెయిన్ ఆ వీధి అంతా చేయకుండా కొంత భాగానికే పరిమితం చేస్తున్నారు. ఇలా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతున్న రోడ్లకు కార్పొరేషన్ అధికారులు బిల్లులు ఎలా చెల్లింపు చేస్తున్నారో అర్థం కాకుండా ఉన్నది.

నగరంలోని మస్తాన్ దర్గా వెనక రోడ్డు ఇంజనీరింగ్ నిబంధనలు తుంగలోకి తొక్కారు. గతంలో ఈ రోడ్డు మెటల్ రోడ్డుగా సింగిల్ డివైడర్ సదుపాయాన్ని కలిగి ఉన్నది. అయితే రోడ్డుని డ్రెయిన్ టూ డ్రెయిన్ నిర్మించలేదు. దీంతో ఆక్రమణలు దారి పొడవునా ఉన్నాయి. ఇక ఈ రోడ్డు జీఎస్‌టీ రోడ్డులో అనుసంధానం జరిగే ప్రదేశంలో లోతట్టుగా ఉండటం వలన వర్షం నీరు నిలబడుతున్నదని అక్కడ నుంచి కొంతభాగం వరకు సీసీ రోడ్డుని డ్రెయిన్ టూ డ్రెయిన్ నిర్మించారు. మిగతా భాగాన్ని అలానే వదిలేశారు. ఈ రోడ్లు అనుసంధానం అయ్యే చోట స్లోప్‌ని కేవలం డస్టు వేసి వదిలేశారు. ఒక వర్షం కురిస్తే ఆ డస్టు అంతా కొట్టుకుపోయి ఎగుడుదిగుడుగా తయారౌతుంది. ఈ నేపథ్యంలో నగరంపాలెం మూడు బొమ్మల సెంటర్ వరకు డ్రెయిన్ టూ డ్రెయిన్ సీసీ రోడ్డుని నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



సీసీ రోడ్డు, మెటల్ రోడ్డు అనుసంధానం వద్ద స్లోప్‌ని డస్టు వేసి వదిలేసిన చిత్రం

ఔషధ మొక్కలతో విస్తృత ప్రయోజనాలు

గుంటూరు(విద్య) ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఔషధ మొక్కలపై విద్యార్థులకు ప్రాథమిక అవగాహన ఉండాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సూచించారు. జేకేసీ కళాశాలలో వృక్ష శాస్త్ర విభాగం, ఐక్యూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఔషధ మొక్కల ప్రదర్శనను మంగళవారం ఆయన ప్రారంభించారు. ప్రతి ఇంట్లో, పొలాల్లో ఔషధ మొక్కలను పెంచేలా అవగాహన కలిగించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి జాగర్లమూడి మురళీమోహన్ ప్రిన్సిపల్ పి.గోపీచంద్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కే.సాంబశివరావు, పయనీర్ సంస్థల అధినేత చుక్కపల్లి రమేష్, పీజీ కోర్సులు డైరెక్టర్ ఎస్ఆర్‌కె ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాలయాలు విజ్ఞాన సంపదకు వేదిక కావాలి



పుస్తకాల పంపిణీ అనంతరం విద్యార్థులతో ప్రసాద లింగం

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి విద్యార్థులు ఎక్కువ మంది ఉన్న ప్రభుత్వ విద్యాలయాలు విజ్ఞాన సంపదకు వేదిక కావాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ మాజీ సూపరింటెండెంట్ వీబీ ప్రసాద లింగం అన్నారు. నగరంలోని ఏటీ అగ్రహారం శ్రీ కస్తూర్బా గాంధీ మునిసిపల్ పాఠశాలలో మంగళవారం జనరల్ నాలెడ్జ్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వీబీ ప్రసాద లింగం మాట్లాడుతూ పాఠశాలలోని 250 మంది విద్యార్థులకు ముందుగా పరీక్ష నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారిని గుర్తిస్తున్నామని చెప్పారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరం అయ్యే జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్‌కు చెందిన అనురాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నృత్యంలో సీతారామయ్య హైస్కూల్ విద్యార్థినికి ప్రథమ బహుమతి

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): సిటిజన్స్ వెల్ఫేర్ ఫామ్ అండ్ ప్రైడ్ ఇండియా కల్చరల్స్ వారి ఆధ్వర్యంలో అయోధ్య రామునికి నాట్య నీరాజనం, శ్రీకృష్ణదేవరాయ జయంతి ప్రతిభా పురస్కారోత్సవాల సందర్భంగా ఈనెల 16న తిరుపతి మహతి ఆడిటోరియంలో ఇంటర్నేషనల్ లెవెల్ ఇండియన్ కన్వెన్షన్ డాన్సింగ్ కన్సర్ట్‌లో శ్రీ పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ (సీబీఎస్ఈ) పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న తుమ్మూరు జ్ఞానితి ప్రథమ బహుమతిని కైవసం చేసుకుందని పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ళ కృష్ణవేణి, ప్రిన్సిపల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతిదేవి, కో ఆర్డినేటర్స్ దుర్గా శ్యామ్, శ్రీదేవి పాల్గొని విద్యార్థినిని అభినందించారు.

ఎన్‌సీసీ ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు అభినందనీయం

గుంటూరు(తూర్పు) ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : ఏపీకి ఎన్‌సీసీ ప్రత్యేక డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఏపీ, తెలంగాణ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమోడోర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. స్థానిక శ్యామలానగర్‌లోని ఏపీ డైరెక్టరేట్ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. ఆయన మాటాడుతూ కొత్తగా ఏర్పడిన ఏపీకి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక డైరెక్టరేట్‌ను మంజూరు చేసిందన్నారు. ఎన్‌సీసీ అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పార్శిల్స్ కార్యాలయాల్లో విజిలెన్స్ తనిఖీలు



పార్శిల్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ సీఐ పి.శివాజీ

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పార్సిల్స్ కార్యాలయాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పార్శిల్ కార్యాలయానికి ఎటువంటి సరుకులు, వస్తువులు వస్తున్నాయి.. ఎక్కడికి వెళ్తున్నాయి అనే దానిపై ఆరా తీశారు. వచ్చిన ప్రతి దానికి బిల్లు ఉందా లేదా అనే విషయాన్ని తనిఖీ చేశారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్లు విజిలెన్స్ సీఐ పి.శివాజీ తెలిపారు. అనుమానాస్పద వస్తువులు, సరుకులు, బిల్లులు లేకుండా సరఫరా అయ్యేవి ఏవి ఉన్నా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

కేఎస్ లక్ష్మణరావుపై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు

● ఎన్నికల కమిషన్ ఆదేశాలతో అరండల్‌పేట స్టేషన్‌లో కేసు

గుంటూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్ని కల్లో పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుపై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టారంటూ వచ్చిన ఫిర్యాదుపై అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కే సత్యనారాయణ, పిల్లి కోటి, జెట్టి రేణుక తదితరులు సోషల్ మీడి యాలో ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావుపై ఓటర్ల లో వ్యతిరేక భావం కలిగించే దురుద్దేశంతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన తర పున ఎన్నికల చీఫ్ ఏజంట్ రమేష్‌బాబు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. దీంతో తగు చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘం కలెక్టర్‌ను ఆదేశించింది. దీంతో కలెక్టర్ ఎస్పీ కి ఫిర్యాదు పంపడంతో ఆయన అరండల్‌పేట స్టేషన్‌కు పంపడంతో మంగళవారం స్టేషన్‌లో సత్యనారాయణ, పిల్లి కోటి, జెట్టి రేణుకల మీద పోలీసులు కేసు నమోదు చేశారు.

లింకు పంపి మూడు లక్షలు మాయం

మల్లికార్జునపేటకి చెందిన కొమెర్ల వరప్రసాద్ అనే వ్యక్తికి సైబర్ నేరగాళ్ళు మూడు లక్షలకు టోపీ పెట్టారు. ఆయన ఈ నెల 8న గీజర్ మరమ్మతు విషయమై వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేసేందుకు గానూ గూగుల్‌లో ప్రయత్నించాడు. దీంతో గుర్తు తెలియని వ్యక్తి ప్రసాద్‌కు ఫోన్ చేసి సదరు కస్టమర్ ఫోరంలో ఫిర్యాదు చేయడం కోసం ఒక లింకు పంపి వివరాలు నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయనకు ఓటీపీ పంపి ఆయా వివరాలు తెలుసుకుని ప్రసాద్ ఖాతా నుంచి రూ.3 లక్షలు మాయం చేశాడు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని ఆన్‌లైన్‌లో మోసం చేసిన ఘటనపై అరండల్‌పేట స్టేషన్‌లో కేసు నమోదైంది. వసంతారాయపురం కు చెందిన గోరంట్ల మోహన్ సాయి అను అతను ఆన్లైన్‌లో జాబ్ కోసం బయోడేటా పెట్టుకోగా బైరెడ్డి మధు అను అతను ఫోన్ చేసి, ప్రైవేటు కంపెనీలో సాఫ్ట్ వేర్ జాబ్ ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి పలు దఫాలు గా రూ.లక్షా 20వేలు తీసుకొని జాబ్ ఇప్పించకుండా మోసం చేసినట్లు, ఇచ్చిన రిపోర్టు మేరకు కేసు నమోదు చేసి అరండల్‌పేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

క్రమశిక్షణ, సమయపాలనే విజయానికి మార్గం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సమయపాలన, క్రమశిక్షణ విద్యార్థుల విజయానికి మూల స్తంభాలని, పదో తరగతి విద్యార్థులు అత్యద్భుతమైన ఫలితాలు సాధించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరులోని అంజుమన్ ఇస్లామియా పాఠశాల ఫేర్ వెల్ వేడుకకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ 'లేవండి, మేల్కొనండి, గమ్యం చేరే వరకు విశ్రమించకండి.' అంటూ వివేకానంద చెప్పిన మాటలను విద్యార్థులకు చెప్పి స్ఫూర్తి నింపారు. సీఎం చంద్రబాబు, విద్యా శాఖా మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం విద్యను బలోపేతం చేసే దిశగా ప్రణాళికలు రూపొందించారని తెలిపారు. మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ ద్వారా పాఠశాలల్లో విద్యార్థుల ప్రగతి పెరిగిందని, దీంతో తల్లిదండ్రులు సంతోషంగా ఉన్నారని చెప్పారు. విద్యార్థుల ఆత్మస్థైర్యంతో, ప్రశాంతంగా పరీక్షలకు హాజరు కావాలని సూచించారు.

తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి

● కమిషనర్‌తో పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి



కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని కమిషనర్ పులి శ్రీనివాసులును పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి, కోరారు. నగరపాలక సంస్థలోని ఆయన చాంబర్‌లో మంగళవారం ఆమె కలిసి పలు ప్రజా సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకొని వెళ్లారు. రాబోయే వేసవి కాలంలో ప్రజలకు అంతరాయం లేకుండా తాగునీటి సరఫరాను అందించాలని, ఎక్కడ కూడా లీకేజీ సమస్యలు లేకుండా చూడాలని కోరారు. అమృత్ పథకం క్రింద ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి కనెక్షన్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా కాలువల్లో మురుగు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గంలో అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్లు, డ్రైనేజీ పనుల గురించి చర్చించారు. నియోజకవర్గంలో కుక్కల బెడద మళ్ళీ మొదటికి వచ్చిందని, వారం రోజుల క్రితం కేవీపీ కాలనీలో ఓ చిన్నారిపై దాడి చేయటం బాధాకరమని, వీధి కుక్కలను కట్టడి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏఐతో విప్లవాత్మక మార్పులు

● కంప్యూటర్ సైంటిస్ట్ డాక్టర్ కన్నెగంటి రామారావు



మాట్లాడుతున్న డాక్టర్ కన్నెగంటి రామారావు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) అనుసంధానంతో టెక్నాలజీ రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని కంప్యూటర్ సైంటిస్ట్, కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్, స్టార్ట్ అప్ ఫౌండర్ డాక్టర్ కన్నెగంటి రామారావు అన్నారు. చౌడవరంలోని ఆర్‌వీఆర్‌అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం 'ఎంప్లాయర్ ఎక్స్‌పెక్టేషన్ ఇన్ ది ఎరా ఆఫ్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఏఐ ఆధారిత టూల్స్, పెద్ద భాషా మోడల్స్ వేగంగా, సమర్థవంతంగా జరిగే కంటెంట్ క్రియేషన్, డేటా, కమ్యూనికేషన్ తదితర అంశాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, కళాశాల ఏఐ అండ్ ఎంఎల్ విభాగాధిపతి ప్రొఫెసర్ జి.రామమోహన్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజ్ఞాన్‌లో సర్వైకల్ క్యాన్సర్ టీకాలు పంపిణీ



విద్యార్థులకు టీకాలు వేస్తున్న వైద్యులు

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పలకలూరులోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో మంగళవారం సర్వైకల్ క్యాన్సర్ పై అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సర్వైకల్ క్యాన్సర్ టీకాలు వేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ మాజీ గవర్నర్ వడ్లమాని రవి, విజ్ఞాన్ విద్యాసంస్థల సీఈవో డాక్టర్ మేఘన, ప్రిన్సిపల్ డాక్టర్ వి.అనురాధ తదితరులు పాల్గొన్నారు

ఉద్యోగులు క్రీడలపై ఆసక్తి చూపాలి

● సీజీఎస్‌టీ గుంటూరు కమిషనర్ నరసింహారెడ్డి



పతకాలు సాధించిన ఉద్యోగులను అభినందిస్తున్న కమిషనర్ నరసింహారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్‌లు

గుంటూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో అవిశ్రాంతంగా పనిచేసే ఉద్యోగులకు క్రీడలు మేధాశక్తిని, సామర్థ్యాన్ని మరింత పెంచుతాయని కస్టమ్స్, సెంట్రల్ ట్యాక్స్ గుంటూరు కమిషనర్ సాధు నరసింహారెడ్డి అన్నారు. బెంగుళూరులో ఈనెల 21 నుండి 23 వరకు జరిగిన 54వ అఖిల భారత రెవిన్యూ స్పోర్ట్స్ మీట్‌లో స్వర్ణ, రజిత పతకాలు సాధించి, గుంటూరుకు తిరిగొచ్చిన క్రీడా ఉద్యోగులు పి వెంకటాచలం, పి.వెంకటేశ్వర్లుకు మంగళవారం కన్నవారితోటలోని సీజీఎస్‌టీ భవన్‌లో అభినందన కార్యక్రమం జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ తమ శాఖకు చెందిన సూపరింటెండెంట్ పి వెంకటాచలం లాన్ టెన్నిస్ 50 ప్లస్ డబుల్స్‌లో స్వర్ణ పతకం, 40 ప్లస్ సింగిల్స్, డబుల్స్‌లో రెండు రజిత పతకాలు, టాక్స్ అసిస్టెంట్ పి.వెంకటేశ్వర్లు 100 మీటర్ల పరుగు పందెంలో రజిత పతకం గెలుచుకొని గుంటూరు సెంట్రల్ జీఎస్‌టి కమిషనరేట్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చారని కొనియాడారు. పతకాలు సాధించిన వెంకటాచలం, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శాఖాపరంగా కమిషనర్ అందిస్తున్న ప్రోత్సాహం, సహకారం, తోడ్పాటు మరువలేనిదన్నారు. అనంతరం కమిషనర్ ఇద్దరు విజేతలను శాలువాలతో ఘనంగా సత్కరించి, ప్రశంసాపత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్లు ఎం.నాగరాజు, బి.ఆనందరావు, సూపరింటెండెంట్లు గాదె శ్రీనివాసరెడ్డి, చిదేళ్ళ ఈశ్వరరావు, పూర్ణ సాయి, కాకర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అడవి తక్కెళ్ళపాడులో రోడ్లు పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర శివారు ప్రాంతాల అభివృద్ధికి ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రధానంగా మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. మంగళవారం అడవి తక్కెళ్లపాడు రాజీవ్ గృహకల్ప సముదాయం, స్వర్ణభారతి నగర్, అశోక్ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించి, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.

కమిషనర్ మాట్లాడుతూ రాజీవ్ గృహకల్ప ప్రాంతాన్ని పరిశీలించి పారిశుధ్య పనులపై స్థానికుల ఫిర్యాదు మేరకు మెరుగైన చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. అశోక్‌నగర్‌లో పలు అభివృద్ధి పనులను పరిశీలించి నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూడాలన్నారు. అనంతరం ఆర్టీవో కార్యాలయం దగ్గర అన్న క్యాంటీన్‌ని పరిశీలించి తాగునీటి సరఫరాపై ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రతి రోజు డిమాండ్‌కి అనుగుణంగా ఆహారం అందుబాటులో ఉంచాలని అక్షయపాత్ర ప్రతినిధులను ఆదేశించారు. పర్యటనలో డీఈఈ శ్రీనివాస్, ఆర్ఓ రవికిరణ్ రెడ్డి, ఏసీపీ రెహ్మాన్, ఏఈలు, టీపీఎస్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

తమిళనాడ్ మర్కంటైల్ బ్యాంక్ లిమిటెడ్

గుంటూరు బ్రాంచి, డో.నెం.24-2-49, పట్నం బజార్, చావలవారి వీధి, చుండూరు మ్యాన్షన్, గుంటూరు, ఏపీ-522003, ఫోన్: 0863-2222964.

శీతల గిడ్డంగిలోని నిల్వల (ఎండుమిర్చి) అమ్మకపు వేలం వాయిదా ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ది.08-02-2025 నాటి "ఆంధ్రజ్యోతి" దినపత్రికలలో ప్రచురించబడిన విధంగా ది.25-02-2025న ఋణగ్రహీతలు: శ్రీ గడ్డి వెంకటరెడ్డి (074700220103171), శ్రీ తోటాపుల లోకేశ్వరరావు (074700220103172), శ్రీ కొరివి శ్రీనివాసరావు (074700220103173), శ్రీ తోటాపుల వెంకటకృష్ణ (074700220103176) లకు చెందిన మిర్చి బస్తాల వేలం ది.05-03-2025వ తేదీకి మార్చబడినది. మిగిలిన నియమ నిబంధనలలో ఎటువంటి మార్పు లేదు.

ప్రదేశం : గుంటూరు, తేది : 25-02-2025 సం/- అధీకృత అధికారి, తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్ లిమిటెడ్.

● నేడే మహా శివరాత్రి తిరునాళ్ల

● విద్యుత్ వెలుగుల్లో దేదీప్యమానంగా కోటప్పకొండ

● అమరావతి, కాకాని, గోవాడ, క్వారీ సహా శైవక్షేత్రాల్లో ఏర్పాట్లు



విద్యుత్ కాంతులతో శోభిల్లుతున్న కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి సన్నిధి

శివపూజకు.. వేళాయె

అమరావతిలో ప్రత్యేక ఏర్పాట్లు

అమరావతి: బుధవారం మహాశివరాత్రి పర్వది నానికి అమరేశ్వరాలయంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు స్నానఘాట్ వద్ద జల్లు స్నానానికి ఏర్పాట్లు చేశారు. స్త్రీలు దుస్తులు మార్చుకునేందుకు ఏర్పాట్లు చేశారు. క్యూల్లో ఉండే భక్తులకోసం



షామియానాలు, తాగునీటి తదితర ఏర్పాట్లు చేశారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ఉచిత ప్రసా దాలు, పాలు, అన్నదానం చేసేందుకు పలువురు దాతలు సిద్ధమయ్యారు. స్వామివారి కల్యాణానికి మండపాన్ని సిద్ధం చేశారు. బందోబస్తు పోలీసులు మంగళవారం సాయంత్రానికి అమరావతి చేరుకున్నారు. మంగళవారం బాలచాముండిక అమ్మవారు పులి వాహనంపై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అనంతరం పల్లకిలో బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి వార్లను ఊరేగించారు. కార్యక్రమంలో ఈవో సునీల్‌కుమార్ వేదపండితులు, అర్చకులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముస్తాబైన మల్లన్న సన్నిధి

పెదకాకాని: మహాశివరాత్రికి పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రంగు రంగుల విద్యుత్ దీపాలతో ఆలయ ప్రాంగణం దేదీప్యమానంగా వెలుగొందుతుంది. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయంలో ప్రత్యేక



క్యూలను ఏర్పాటు చేశారు. దేవస్థానం తరఫున, వివిధ సంఘాలు, సంస్థల సభ్యులు ప్రత్యేకంగా భక్తులకు సేవలు అందించేందుకు ముందుకు వచ్చారు. ఆలయంలో భక్తులకు ఉచిత ప్రసాదాలు, భోజన సదుపాయాలను కల్పిస్తున్నారు. బుధవారం రాత్రి 11 గంటలకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, రెండు గంటలకు స్వామివారి గ్రామోత్సవం, ఆ తర్వాత శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఈవో,ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు.

కోటప్పకొండ(నరసరావుపేట), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శైవక్షేత్రం కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వర స్వామి తిరునాళ్ల బుధవారం నేత్ర పర్వంగా జరగనుంది. భక్తుల కోసం కోటప్పకొండలో సర్వం సిద్ధం చేశారు. విద్యుత్ దీపాల అలంకరణలతో కోటప్పకొండ దేదీప్యమానంగా వెలుగొందుతోంది. కొండ ఎగు వున, దిగువున విద్యుత్ దీపాలను పెద్దఎత్తున ఏర్పాటు చేశారు. త్రికోటేశ్వరస్వామి సన్నిధి తిరునాళ్లకు ముస్తాబైంది. అర్ధరాత్రి స్వామికి లింగోద్భవ అభిషేకాలు వైభవంగా జరగను న్నాయి. తిరునాళ్లకు రాష్ట్ర పండుగ హోదాతో ప్రభుత్వం తరఫున కోటయ్యస్వామికి బుధవా రం దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. అభిషేక మండపం లో ప్రత్యేక అభిషేకాల కోసం ఏర్పాట్లు చేశారు. చిలకలూరిపేట మేజర్ కాల్వ వద్ద భక్తుల కోసం స్నానఘట్టాలను ఏర్పాటు చేశారు. భక్తులు తలనీలాలు సమర్పించేందుకు కొండ దిగువున ప్రత్యేక షెడ్ ఏర్పాటు చేశారు. ఆలయంలో ఏర్పాట్లను ఈవో చంద్రశేఖరరావు, ట్రస్టీ రామకృష్ణ కొండలరావు పర్యవేక్షిస్తున్నారు. తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లను భక్తులకు పంపిణీ చేసేందుకు దేవస్థానం, సేవా సంస్థల ఆధ్వర్యంలో భారీగా సిద్ధం చేశారు. స్కౌట్స్ అండ్ గైడ్స్, సత్యసాయి సేవా సమితి సభ్యులు సేవలు అందించేందుకు కొండకు తరలి వచ్చారు.

కోటప్పకొండకు 550 బస్సు సర్వీసులు

కోటప్పకొండకు ఆర్టీసీ 550 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ, అద్దంకి, చీరాల, ఒంగోలు బస్టాండ్‌ల నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. వీఐపీల కోసం 20 ఆర్టీసీ వాహనాలను ఏర్పాటు చేశారు. ఘాట్ రోడ్డులో 85 బస్సులు నిర్వహించనున్నారు. కొండ వద్ద చిలకలూరిపేట రోడ్డులో, ఘాట్ రోడ్డు పక్కన, కొండపైన ఆర్టీసీ తాత్కాలిక బస్టాండ్లను నిర్వహిస్తున్నది.

అన్నదానాలకు భారీగా ఏర్పాట్లు

కొండ దిగువున ఉన్న వివిధ సామాజిక సత్రాలలో లక్షల మందికి అన్నదానం జరగనుంది. మధ్యాహ్నం, రాత్రి రెండు పూటలా అన్నదానం చేసేందుకు సత్రాల నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. దేవస్థానం వద్ద, కొండ దిగువ ప్రాంతాలలో తొమ్మిది వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. కొండలోని పీహెచ్‌సీలో ప్రత్యేకంగా పడకలు ఏర్పాటు చేశారు. ఎక్సైజ్ శాఖ కొండ ప్రాంతంలో మద్య నిషేధం విధించింది. పది కిలో మీటర్ల వరకు మద్యం విక్రయాలను నిలిపి వేశారు.

2,500 మంది పోలీసులతో బందోబస్తు

తిరునాళ్లకు లక్షలాదిగా భక్తులు తరలిరానున్న నేప థ్యంలో పోలీసులు పటిష్ఠ భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వర రావు పర్యవేక్షణలో 2,500 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటున్నారు. బందోబస్తు పర్యవేక్షణకు కొండ ఎగువున, దిగువున కమాండ్ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. సీసీ కెమేరాల ద్వారా బందోబస్తును పర్యవేక్షిస్తారు. డ్రోన్‌లను కూడా వినియోగిస్తున్నారు. మంగళవారం సాయంత్రం నుంచే పోలీసులకు విధులు కేటాయించారు. కొండ ప్రాంతం వద్ద డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. చిలకలూరిపేట, నరసరావుపేట, పెట్లూరివారిపాలెం రహదారుల్లో ట్రాఫిక్ జామ్ కాకుం డా వన్‌వే నిర్వహిస్తారు. కొండ ఎగువున, దిగువున తాత్కాలిక రూరల్



కోటప్పకొండకు ప్రభతో తరలివస్తున్న చిన్నారులు



కోటప్పకొండకు తరలివస్తున్న అవిశాయపాలెం భారీ విద్యుత్ ప్రభ

పోలీసుస్టేషన్ ఏర్పాటు చేశారు. బందోబస్తు ఏర్పాట్లను మంగళవారం ఎస్పీ పర్యవేక్షిం చారు. తిరునాళ్ల ఏర్పాట్లపై కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

19 భారీ విద్యుత్ ప్రభలు

కోటప్పకొండ తిరునాళ్లకు వివిధ ప్రాంతాల నుంచి 19 భారీ విద్యుత్ ప్రభలు తరలివస్తున్నాయి. వివిధ గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో ప్రభలు మంగళవారం కొండకు పయనమయ్యాయి. ప్రభల రాక నేపథ్యంలో చిలకలూరిపేట రోడ్డులోని ప్రధాన విద్యుత్ లైన్‌కు బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఒక్కొక్క ప్రభ 90 అడుగులకు పైగా ఎత్తులో నిర్మించారు. నాదెండ్ల మండలం అవిశాయపాలెం, అప్పాపురం గ్రామాల నుంచి భారీ విద్యుత్ ప్రభలు కొండకు తరలివస్తున్నాయి. చిలకలూరిపేట మండలం కమ్మవారిపాలెం, మద్దిరాల, యడవల్లి, గోవిందాపురం, కోమటినేని వారిపాలెం, కావూరు నుంచి ఒక్కో క్కటి, చిలకలూరిపేట మండలం పురు షోత్తపట్నం నుంచి ఆరు, బొప్పూడి నుంచి రెండు భారీ విద్యుత్ ప్రభలు కొండకు వస్తు న్నాయి. నరసరావుపేట మండలంలోని ఉప్పలపాడు, గురవాయపాలెం నుంచి ఒక్కొక్కటి, కాకాని గ్రామం నుంచి రెండు భారీ విద్యుత్ ప్రభలు కొండకు తరలి వస్తున్నాయి. నరసరా వుపేట పట్టణం, పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో సాధారణ ప్రభలు కొండకు తరలివస్తున్నాయి.

వీఐపీలకు పెద్దపీట

కోటప్పకొండ తిరునాళ్లలో వీఐపీలకు పెద్ద పీట వేస్తున్నారు. వీరి సేవలో అధికారులు తరించనున్నారు. సామాన్య భక్తులకు అటు ఆర్టీసీ, ఇటు దేవస్థానం అన్ని సేవలకు టిక్కెట్లను విక్రయిస్తున్నది. అయితే కొండ కింద కారు దిగిన దగ్గర నుంచి స్వామి దర్శనం చేసుకునే వర కు వీఐపీలకు అన్ని సేవలను ఉచితంగా అందించేందుకు అధికారులు భారీగా ఏర్పాట్లు చేశారు. వేలాదిగా దర్శనం పాసులను పంపిణీ చేశారు. వీఐపీలకు ఉచితంగా 20 బస్సులను ఏర్పాటు చేసిన ఆర్టీసీ సామాన్య భక్తుల నుంచి అధిక చార్జీలను వసూలు చేస్తున్నది.



స్నాన ఘట్టం వద్ద భారీ శివ కుటుంబం విగ్రహం



శ్రీ త్రికోటేశ్వరస్వామి దేవస్థానంలో బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ శ్రీనివాసరావు



శ్రీ త్రికోటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, చదలవాడ అరవిందబాబు, యరపతినేని నిఖిల్

ఉత్సవాలకు.. క్వారీ సిద్ధం

పొన్నూరుటౌన్(చేబ్రోలు): ప్రముఖ శైవక్షేత్రమైన వడ్లమూడి క్వారీ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయం మహాశివరాత్రి ఉత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు దేవదాయశాఖ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. గతంలో ఉన్న టిక్కెట్లు వ్యవస్థను రద్దుచేశారు. ఇప్పటికే రెండురోజులుగా ఆలయంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. మంగళవారం భక్తులు పెద్దసంఖ్యలో స్వామి దర్శనానికి పోటెత్తారు. ట్రాఫిక్ మళ్లించి రద్దీ నియంత్రణకు పోలీసుశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. తెనాలి సబ్ కలెక్టర్ సంజనాసిన్హా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఏడు భారీ విద్యుత్ ప్రభలు ఆలయానికి చేరుకుంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఒక్కో ప్రభ ఎత్తు 50 అడుగుల పైగానే నిర్మించారు. పారిశుధ్య పనులకు పొన్నూరు, చేబ్రోలు, తెనాలి ప్రాంతాల్లోని పారిశుధ్య కార్మికులకు విధులు కేటాయించారు.



నారాకోడూరు గ్రామంలో రూపుదిద్దుకున్న భారీ విద్యుత్ ప్రభ



గోవాడలో విస్తృత ఏర్పాట్లు

అమృతలూరు: మహాశివరాత్రి ఉత్సవాలకు గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయాన్ని. భక్తుల దర్శనానికి సిద్ధం చేశారు. మంగళవారం రైతులు పశు సంపదను తోలుకు వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. స్వామి వారికి వెన్న తదితర మొక్కుబడులను చెల్లించారు. ఇక్కడ శివరాత్రి ఉత్సవాలు ఐదు రోజులు జరుగుతాయి. బాలలకు వినోదం అందించేందుకు జెయింట్ వీల్, తదితర వినోద సాధనాలు ఏర్పరిచారు. తెనాలి, బాపట్ల, రేపల్లె నుండి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుంది. కాకతీయ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, పద్మశాలీయ, శాలివాహన అన్నదాన సత్రాల్లో భక్తులకు అన్నదానం చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

పట్టభద్రుల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

ఎన్నికల సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు

గుంటూరు ఏసీ కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి బుధవారం రూట్ల వారీగా పోలింగ్ సామగ్రిని సిబ్బందికి కేటాయించి బస్సులు/వాహనాల్లో తరలిస్తామని రిటర్నింగ్ అధికారి,గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. పల్నాడు జిల్లాకు సంబంధించి ఎస్ఎస్ఎన్ కాలేజీ నరసరావుపేట, బాపట్ల జిల్లాకు సంబంధించి రేపల్లెలోని ఏవీఆర్ డిగ్రీ కళాశాల, బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో, కృష్ణా జిల్లాలో గుడివాడ ఆర్డీవో ఆఫీసు, ఉయ్యూరు ఆర్డీవో ఆఫీసు, నోబెల్‌కాలేజీ, ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి విజయ వాడ సబ్ కలెక్టర్ ఆఫీసు, నందిగామ ఆర్డీవో ఆఫీసు, తిరువూరు జడ్పీ బాలికల పాఠశాల, ఏలూరు జిల్లాకు సంబంధించి నూజివీడు సబ్ కలెక్టర్ ఆఫీసు, ఏలూరు గిరిజన భవన్‌లో ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ జరుగుతుందన్నారు.

లక్ష్మణరావు ఫిర్యాదుని ఎస్పీలకు పంపించాం

తనపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని ఎన్నికల పోటీలో ఉన్న అభ్యర్థులలో ఒకరైన సిట్టింగ్ ఎమ్మె ల్సీ కేఎస్ లక్ష్మణరావు ఫిర్యాదు చేశారని కలెక్టర్ తెలిపారు. ఆ ఫిర్యాదుని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆరు జిల్లాల ఎస్పీలకు పంపించామని చెప్పారు. ఈ సమావేశంలో డీఆర్వో ఎస్ఎస్‌కే ఖాజావలి పాల్గొన్నారు.

గుంటూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రిటర్నింగ్ అధికారి,గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి చెప్పారు. మంగళవారం గుంటూరు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 27న ఉదయం 8 నుంచి సాయంత్రం నాలుగు గంటల మధ్య పోలింగ్ జరుగుతుందన్నారు. ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రంతో ముగిసిందన్నారు. 48 గంటల పాటు మద్యం దుకాణాలకు కూడా సీలు వేస్తామన్నారు. ఓటర్లు కచ్చితంగా ఎన్నికల సంఘం నిర్దేశించిన 10 ఐడీ కార్డులలో ఏదో ఒకటి తప్పక తీసుకుని పోలింగ్ బూత్‌కు వెళ్లాలన్నారు. ఐడీ కార్డుతో పాటు స్లిప్పు కూడా వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఓటర్ల సహాయం కోసం కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. గుంటూరులో కంట్రోల్ రూంని ఏర్పాటు చేసి నంబరు.0863-2241029 నంబరుని ఓటర్లకు అందుబాటులో ఉంచుతామన్నారు. 3 లక్షల 47 వేల 116 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించు కునేలా స్వీప్ కార్యక్రమాల ద్వారా ప్రతీ మండలంలో అవగాహన కల్పించామన్నారు.

ఓటుపై అవగాహన అవసరం

ఓటు వేసే విధానంపై ఓటర్లు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏ అభ్యర్థికి అయితే తొలి ప్రాధాన్య ఓటు వేయదలిచారో ఆ అభ్యర్థి పేరు పక్కన ఉన్న గడిలో 1 అని అంకె వేయాలన్నారు. ఆ తర్వాత 2, 3, 4... ఇలా 25 మంది అభ్యర్థులకు ప్రాధాన్య ఓట్లు అంకెల రూపంలో వేయవచ్చన్నారు. పోలింగ్ బూత్‌లో ఇచ్చే వంకాయ రంగు పెన్నుతోనే ప్రాధాన్య ఓటు అంకెని నమోదు చేయాల న్నారు. పోస్టల్ బ్యాలెట్లు తీసుకున్న ఉద్యోగులు మాత్రం ఏ పెన్నుతోనైనా అంకె నమోదు చేయవచ్చన్నారు. ఉద్యోగులు ఓటు వేసేందు కోసం గురువారం స్పెషల్ క్యాజువల్ లీవ్‌ని ఎన్నికల సంఘం ప్రకటించిందని, దరఖాస్తు చేసుకుంటే తప్పక దానిని ఆమోదించాలని అన్ని కేం ద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, సంస్థలను ఆదేశించారు. ఆరు జిల్లాల పరిధిలో ఈ నియోజకవర్గానికి సంబంధించి 483 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటిలో 140 పీఎస్‌లు క్లిష్టమైనవిగా గుర్తించి అదనపు పోలీసు బలగాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రానికి వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ, మైక్రో అబ్జర్వర్‌ని ఏర్పాటు చేస్తున్నామన్నారు.

❖ క్లిష్టమైన బూత్‌ల వద్ద అదనపు బందోబస్తు ❖ ప్రతీ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్, వెలుపల వీడియోగ్రఫీ
❖ 0863-2241029 నెంబరుతో కంట్రోల్ రూం ఏర్పాటు
❖ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి



ఎమ్మెల్సీ ఎన్నికలపై ఆరు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న పరిశీలకురాలు వీ కరుణ

ప్రశాంత పోలింగ్ నిర్వహించాలి

కలెక్టర్లు, ఎస్పీలకు ఎన్నికల పరిశీలకురాలి ఆదేశాలు

పట్టభద్రుల ఎన్నికల ఓటింగ్ పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు చేపట్టాలని జనరల్ అబ్జర్వర్ వీ కరుణ ఆరు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు. మంగళవారం గుంటూరు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ఆమె ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ భార్గవ్‌తేజతో కలిసి ఎన్నికల ఓటింగ్‌పై ఎన్టీఆర్, కృష్ణా, పల్నాడు, బాపట్ల, ఏలూరు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్జర్వర్ కరుణ మాట్లాడుతూ ఓటింగ్ సక్రమంగా జరిగేలా కలెక్టర్లు, ఎస్పీలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో కేంద్రాల్లో ఓటింగ్‌కు చర్యలు పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్లు వరకు 144 సెక్షన్‌ను విధించాలన్నారు. ఓటు వేయడానికి వచ్చే వీఐపీలకు నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి మాట్లాడుతూ పోలింగ్ మెటీరియల్ తరలింపునకు రూట్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. కృష్ణా, బాపట్ల, పల్నాడు, ఏలూరు జిల్లాల కలెక్టర్లు బాలాజీ, మురళి, అరుణ్‌బాబు, వెట్రిసెల్వి మాట్లాడుతూ బ్యాలెట్ పేపరు, ఎన్నికల సామగ్రిని పోలింగ్ కేంద్రాల వారీగా వేరు చేశామన్నారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు, ఏలూరు, కృష్ణా, బాపట్ల జిల్లాల ఎస్పీలు ప్రతాప్‌శివకిశోర్, గంగాధర్‌రావు, తుషార్‌డూడీ మాట్లాడుతూ క్రిటికల్ పోలింగ్‌స్టేషన్ల వద్ద అదనపు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు



రెండు రోజులు మద్యం దుకాణాలు బంద్

తుళ్లూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రెండు రోజులు మద్యం దుకాణాలు బంద్ చేశారు. మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు ఎక్సైజ్‌శాఖ అధి కారులు మండలంలోని 4 మద్యం దుకాణాలకు సీల్ వేశారు. ముందే తెలుసుకున్న బెల్టు షాపుల నిర్వాహకులు భారీగా మద్యం కొనగోలు చేసినట్టు తెలిసింది.

14న అమరావతిలో శ్రీనివాస కల్యాణం

తిరుమల, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో మార్చి 14వ తేదీన శ్రీనివాస కల్యాణాన్ని నిర్వహిస్తామని టీటీడీ ఈవో శ్యామలరావు వెల్లడించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం లో అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మంతో కలిసి మంగళవారం సమీక్షించారు. అమరావతికి సమీపంలోని వెంకటపాలెంలో ఉన్న టీటీడీ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో శ్రీనివాస కల్యాణా న్ని వైభవంగా నిర్వహిస్తామన్నారు. ప్రతిష్ఠాత్మకంగా శ్రీనివాస కల్యాణాన్ని చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు గడువులోపు పూర్తిచేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సీఎం చంద్రబాబునా యుడు హాజరుకానున్న నేపథ్యంలో అవసరమైన భద్ర త, భక్తులకు క్యూలైన్లు, కల్యాణం రోజున భక్తులు వీక్షించేందుకు వీలుగా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

వక్ఫ్‌బోర్డు ఎమెండ్‌మెంట్ బిల్లును తక్షణమే ఆపాలి

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సర్వమత సమ్మేళనమని వివిధ సంస్కృతి సంప్ర దాయాలకు నిలయమైన భారతదేశంలో వక్ఫ్ బోర్డు ఎమెండ్‌మెంట్ బిల్లును కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చి ముస్లింలను భయభ్రాం తులకు గురిచేస్తుందని ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ సలావుద్దీన్ అన్నారు. మంగళవారం తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలే కరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ముస్లింలకు అండగా నిలబడతారని, బిల్లును వ్యతిరేకించి అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర గౌరవ సలహా దారు సర్దార్ ఖాన్, కోశాధికారి అబ్దుల్ కలాం, వైస్ ప్రెసిడెంట్ హాజీ సయ్యద్ మహబూబ్, మౌలా బేగ్ అబ్దుల్లా, మహబూబ్ బాషా, నసీమా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి చెరువుల పరిశీలన

పెదనందిపాడు,ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగులపాడులో తాగునీటి చెరువులను జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వీ శంకర్ మంగళవారం పరిశీలించారు. గ్రామస్థులు ఇటీవల కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులును కలిసి గ్రామంలో చెరువులను బాగుచేయించాలని వినతిపత్రం అందజేయగా ఈ మేరకు అధికారులు గ్రామానికి విచ్చేసి చెరువులను పరిశీలించి, చెరువులో పూడిక తీసేందుకు ఉపాధిహామీ పథకం నిధులతో పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు తయారుచేయాలని సిబ్బందిని ఆదేశించారు. త్వరలోనే చెరువులకు మరమ్మతుల పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీదేవి, ఏపీవో సుబ్బారావు, సంగం డెయిరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు, బండి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లాయపాలెం శైవ క్షేత్రంలో శివరాత్రి మహోత్సవాలు

తుళ్ళూరు, ఫిబ్రవరి 25:(ఆంధ్రజ్యోతి) భూకైలాసంగా బాసిల్లుతున్న మండల పరిధిలోని కృష్ణా నదీ తీరన తాళాయపాలెం శైవ క్షేత్రంలో శివరాత్రి సందర్భంగా మహోత్సవాలు జరుగుతున్నాయి. ఈ నెల 23 నుంచి ఉత్సవాలు ప్రారంభించారు. బుధవారం శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని కోటి లింగాల స్వామి వారికి అమ్మవారికి కళ్యాణ మంగళ స్నానాలు రుద్రాభిషేకం , లక్ష్మీనారాయణ కళ్యాణ మహోత్సవం జరుగుతుందని శివస్వామి తెలిపారు. శివరాత్రి పర్వదినం సమయంలో భక్తులకు ఆత్మ లింగేశ్వర స్వామి దర్శనం ఉంటుందని తెలిపారు. ఉదయం పది గంటలకు అన్నపూర్ణ స్వామి సమేత విశ్వేశ్వర స్వామి వారికి అన్నాభిషేకం జరుగుతుందని తెలిపారు. రాత్రి 12 గంటలకు కోటిలింగాల స్వామి వారికి లక్ష రుద్రాక్షలతో అభిషేకం జరుగుతుందన్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం

● మద్యం ఇప్పించలేదని రాయితో కొట్టిన యువకుడు.. పరిస్థితి విషమం

గుంటూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలపరిధిలోని అంకిరెడ్డిపాలెం వైన్ షాపు వద్ద మంగళవారం రాత్రి దొడ్డా కృష్ణప్రసాద్ (40) అనే వ్యక్తిపై హత్యాయత్నం జరిగింది. నల్లపాడు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అంకిరెడ్డిపాలెం ఎస్సీకాలనీకి చెందిన సముద్రాల సాగర్(21) మద్యం తాగేందుకు బాలాజీ వైన్స్ వద్దకు వచ్చాడు. అదే కాలనీకి చెందిన కృష్ణప్రసాద్, సులోచన తదితరులు కూడా మద్యం తాగేం దుకు వైన్స్ వద్దకు వచ్చారు. వైన్స్ వద్ద తనకు మద్యం ఇప్పించాలని కృష్ణప్రసాద్‌ను సాగర్ అడిగాడు. అందుకు కృష్ణ ప్రసాద్ ఒప్పుకోలేదు. ఈ విషయమై ఇరువురి మధ్య వివాదం జరిగింది. దీంతో ఆగ్రహించిన సాగర్ రాయితో కృష్ణ ప్రసాద్‌పై దాడి చేసాడు. బండరాయి తల మీద మీటి హత్యాయత్నం చేసాడు. దీంతో కృష్ణ ప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని జీజీహెచ్‌కు తరలించారు. కృష్ణ ప్రసాద్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కృష్ణప్రసాద్ భార్య ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు సాగర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

మహా శివరాత్రికి సర్వం సిద్ధం

● ఆలయాల వద్ద విస్తృత ఏర్పాట్లు
● భక్తులకు అన్ని విధాలా సౌకర్యాలు
● పటిష్ఠంగా పోలీసు బందోబస్తు
● నేడు స్వామి వార్లకు విశేష పూజలు


విద్యుత్ దీపాలంకరణలో సోమేశ్వరస్వామి ఆలయం



తాడికొండ కొండపై మల్లికార్జునస్వామి ఆలయం

తాడేపల్లిటౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహారాత్రి శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సీతానగరం కృష్ణాతీరం ముస్తాబైంది. భక్తుల పుణ్యస్నానాలు ఆచరించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను కృష్ణానది వద్ద ఏర్పాటు చేశారు. నగర కమిషనర్ అలీం బాషా, డిప్యూటి కమిషనర్ శ్రీకాంత్, తాడేపల్లి సీఐ కళ్యాణ్‌రాజు, తహశీల్దార్ సీతారామయ్య తదితర అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. నదీతీరంలోని సంగమేశ్వర, సోమేశ్వర, రాజరాజేశ్వర ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

తాడేపల్లి పట్టణంలోని నులకపేట చైతన్య తపోవన్‌లో తపోవన్ వ్యవస్థాపకురాలు మాతా శివానంద సరస్వతి ఆధ్వర్యంలో స్వామివారికి విశేష అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి.

పెదనందిపాడు, (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలో ఆయా గ్రామాల్లోని శైవక్షేత్రాలు శివరాత్రి ఉత్సవ వేడుకలకు ముస్తాబయ్యాయి. ఆలయాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు. స్థానిక సోమేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం తెల్లవారుజాము నుంచే అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు నిర్వహకులు తె లిపారు.

తాడికొండ,25(ఆంధ్రజ్యోతి): తాడికొండ కొండపై ఉన్న కొండ మల్లికార్జునస్వామి ఆలయం శివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. ఆలయానికి కాలినడకన వచ్చే వారికి మెట్ల మార్గం, ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాల్లో కొండపైకి రావటానికి ఘాట్ రోడ్డును బాగుచేయించారు. వాహనదారుల పార్కింగ్‌కి ప్రత్యేక ప్రదేశాన్ని ఏర్పాటు చేశారు. కొండ ప్రాంతం మొత్తం ఓంకారేశ్వర చిహ్నాలను అందంగా తీర్చిదిద్దారు. తాడికొండలోని మూలస్థానేశ్వరస్వామి, గిరీశ్వరస్వామి ఆలయాలతో పాటు లాం, పొన్నెకల్లు, కంతేరు, నిడుముక్కల, రావెల, బండారుపల్లి, ఫణిధరం, పాములపాడు ఆలయాలను సుందరంగా అలంకరించారు.


విద్యుద్దీపకాంతులతో పెదనందిపాడు శివాలయం

వట్టిచెరుకూరు, (ఆంధ్రజ్యోతి): సౌపాడు గ్రామంలోని వీరాలోపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, లలిత పరమేశ్వర సమేత ఓంకారేశ్వర స్వామి వార్ల దేవాలయంలో శివరాత్రి సందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం సాయంత్రం నుంచి విఘ్నేశ్వర పూజ, పుణ్యాహ వాచకం, అఖండ దీపారాధన, ధ్వజారోహణ తదితరకార్యక్రమాలతో పూజలు ప్రారంభమయ్యాయి. శివరాత్రి సందర్భంగా ప్రధాన ఘట్టమైన బుధవారం ఉదయం స్వామి వార్లను పెళ్ళి కుమారుడిని చేయటతో పాటు వివిధ కర్యాక్రమాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మేడికొండూరు,(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా మేడికొండూరు మండలం పేరేచర్ల సమీపంలోని కైలాసగిరి క్షేత్రం ముస్తాబైంది. కొండపైన శ్రీగంగా పార్వతి సమేత కైలాస నాథేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. తెల్లవారు జాము నుంచి జరిగే ఈ వేడుకలకు హాజరయ్యే భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ కమిటీ పూర్తి చేసింది. తెల్లవారు జామునుంచే ఏకాదశ రుద్రాభిషేకాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభం అవుతాయి. ఈఏడాది భక్తుల సంఖ్య పెరుగుతుందిని అంచనా. అందుకు తగ్గట్టుగా ఆలయంలోకి భక్తులు ప్రవేశించేందుకు వీలుగా బారికేడ్లు నిర్మించారు. ఆలయ పరిసర ప్రాంతాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. సమీప గ్రామాల నుంచి చిన్న చిన్న ప్రభలతో భక్తులు హాజరై తమ మొక్కుబడులు తీర్చుకుంటారు. మెట్ల మీదుగా కొండపైకి చేరే భక్తులకు మంచినీటి సౌకర్యంతో పాటు దారి పొడవునా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. బుధవారం తెల్లవారు జాము నుంచి రాత్రి 10గంటల వరకు భక్తులకు ఆలయదర్శనానికి అనుమతిస్తారు. ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రసాదం, లక్ష లడ్లు ఉచితంగా అందజేయనున్నారు. మేడికొండూరు ఇన్‌చార్జి ఎంపీడీవో పాటిబండ్ల పూర్ణశంకరావు, ఏవో గరికపాటి శ్రీనివాసరావు, మేడికొండూరు సీఐ మీరా సాహెబ్ ఆలయ కమిటి సభ్యులతో కలసి బందోబస్తుపై చర్చించారు. సుమారు 60 మంది కానిస్టేబుళ్లు, ఇద్దరు ఎస్‌ఐలతో బందోబస్తు పర్యవేక్షిస్తామన్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ కందుల సిద్దయ్య, సభ్యులు కారుమూరి సాంబశివరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కైలాసగిరి క్షేత్రంలో కైలాస నాథేశ్వరుడు, కొండపై ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న అధికారులు ఆలయ కమిటీ సభ్యులు

సురక్షిత నీటిని మాత్రమే అందించాలి

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోనికి సురక్షిత నీటిని మాత్రమే అందించాలని, అందుకు తగ్గట్టుగా ప్రణాళిక తయారు చేసుకోవాలని ప్రత్తిపాడు ఈవోపీఆర్డీ రవికుమార్ అన్నారు. ప్రత్తిపాడు రక్షిత మంచినీటి పథకాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. ప్రస్తుతం ప్రత్తిపాడు మొత్తానికి ఒక మైక్రో ఫిల్టర్ ద్వారా మాత్రమే నీరు సరఫరా అవుతుంది. అయితే ఎంతో కాలంగా నిరుపయోగంగా ఉన్న ఫిల్టర్ బెడ్స్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి పారిశుద్యంపై తీసుకుంటున్న చర్యల గురించి చర్చించారు. ముఖ్యంగా పారిశుద్య కార్మికులను పెంచి ఇంటి నుంచి తడి, పొడి చెత్త సేకరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఖాజా సిబ్బంది పాల్గొన్నారు.

పంట కుంటలపై రైతుల్లో అవగాహన కల్పించాలి

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పొలాల్లో పంట కుంటలు ఏర్పాటు చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు తెలియజేసి వారికి అవగాహన కల్పించాలని డ్వామా పీడీ వడ్డె శంకర్ తెలిపారు. మండలపరిషత్ కార్యాలయంలో ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ఫారంపాండ్స్, ఇంకుడు గుంటలు వంటి ఉపాధిహామీ పనులపై ఒక రోజ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో లక్ష కుంటలు టార్గెట్‌గా పనిచేస్తుంటే గుంటూరు జిల్లాలో2570 కుంటలు టార్గెట్‌గా ఉందన్నారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో 15 కుంటలు తీయాల్సి ఉందన్నారు. ఉపాధిహామీ పథకం కింద చేసన ప్రతి పనివద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా నీటి కుంటలపై శిక్షణను అందించారు. కార్యక్రమంలో ఏపీడీ శివన్నారాయణ, జేకేసీ శ్రీనివాసరావు, ఎంపీడీవో శివపార్వతి, ఏపీవో కొండలు, ఈసీ రాజశేఖర్, అంబుడ్స్‌మెన్ లాయర్ కౌముది, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమ స్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని సీపీఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్‌రావు ధ్వజమెత్తారు. మున్సిపల్ పారిశుద్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యం లో మంగళవారం ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సమస్యలను పరిష్కరించని పక్షంలో కార్మిక సంఘాలన్నింటినీ ఐక్యంచేసి రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో ఏపీ మున్సి పల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గండికోట దుర్గారావు, ఏఐటీ యూసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, నేతలు ఈ హరిబా బు, రాయుడు, బాపనపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మలినేని కళాశాలలో 36 గంటల హ్యాకథాన్

వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లడిగుంట సమీపంలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సోమ, మంగళవారాల్లో టెక్నో ఫ్యూచర్ ఇండియా ఆధ్వర్యంలో సీఎస్ఈ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఐవోటీ విత్ రోబోటిక్స్‌పై 36 గంటల హ్యాకథాన్ నిర్వహించారు. మంగళవారం ముగింపు కార్యక్రమానికి డైనిష్ సీఈవో కరీముల్లా ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. మండలంలోని కొర్నె పాడు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రాజెక్టులను తిలకించి వాటి ప్రాముఖ్యతను తెలుసుకున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలు సిద్ధం

వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండలంలోని గ్రామాల్లో పట్టభద్రుల ఓటర్లు 1130 మంది ఓటు హక్కు వినియోగించుకొనే విధంగా వట్టిచెరుకూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్లో రెండు పోలింగ్ బూత్‌ల మధ్య మంగళవారం సాయంత్రానికి విస్తృత ఏర్పాట్లు చేశారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకొనేందుకు వచ్చిన వారి కోసం ఎలాంటి అసౌకర్యం కలగకుండా టెంట్లు వేశారు. మండల డీటీ దరియావలి, ఇన్‌చార్జ్ ఆర్ఐ ఆదినారాయణ, వీఆర్వో కోటేశ్వరరావులు ఏర్పాట్లను పరిశీలించారు.

ఫిరంగిపురం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్వహించే కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎన్నికలు ఈనెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మం డలంలోని ఫిరంగిపురంలో గల సెయింట్ పాల్స్ హైస్కూల్లో 205, 206, 206ఏ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తహసీల్దార్ జే ప్రసాదరావు మంగళవారం తెలిపారు. మండలంలో మొత్తం 2,074 మంది ఓటర్లు ఉన్నారని, అందులో 1319 మంది పురుషులు, 755 మంది మహిళలు ఉన్నారన్నారు. ఓటర్లందరికీ ఓటరు స్లిప్‌లను పంపిణీ చేశామని తెలిపారు. ఓటర్లందరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా జడ్పీహైస్కూల్ వజ్రోత్సవం

పెదనందిపాడు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని చినలింగాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల ఏర్పడి 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం వజ్రోత్సవాల ను ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎం ఈవో కెన్నడీ మాట్లాడుతూ పాఠశాల ఏర్పాటుకు కృషిచేసిన ఆలపాటి నాగరత్నమ్మ చరిత్రలో నిలిచిపోతారన్నారు. గతేడాది 10 పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఉత్తీర్ణత కనబరిచిన విద్యార్థులను, తల్లిదండ్రులను అభినందించారు. ఈఏడాది కూడా పది ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో 2 కేవీ భాస్కరరావు, విశ్రాంత హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాలు

మంగళగిరి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ కూటమి పార్టీల నేతలు మంగళవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని అన్ని బ్యాంకుల ఉద్యోగులు, ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బందిని కలిసి ఓట్లను అభ్యర్థించారు. టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, జనసేన ఎంటీఎంసీ అధ్యక్షుడు మునగపాటి వెంకట మారుతీరావు, టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, కూటమి నేతలు పాల్గొన్నారు. ఆలపాటి విజయాన్ని కాంక్షిస్తూ పదవ వార్డులో టీడీపీ నేతలు విస్తృత ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి పట్టభద్రులను కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు.

మంగళగిరి సిటీ,(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు గెలుపు కోసం వైసీపీ శ్రేణులు కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పిలుపునిచ్చారు. మంగళగిరి నియోజకవర్గ వైసీపీ కార్యాలయంలో మంగళవవారం పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులతో ఆయన సమావేశమయ్యారు. సమావేశంలో వైసీపీ నేతలు డేవిడ్‌రాజు, పూట్ల పాల శ్రీనివాసరావు,సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.


మంగళగిరిలో కూటమి నేతల ప్రచారం

దుగ్గిరాల, (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతుగా మండలంలోని పెదకొండూరు గ్రామంలో మంగళవారం ఇంటింటికీ తిరిగి కరపత్రాలను అందిస్తూ, ఎన్నికల ప్రచారం జరిపారు. కార్యక్రమంలో కొండూరు నరసింహ, శుద్దపల్లిరవి, కొండూరు జోజిబాబు, ఎస్. అనిల్ పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణ రావును గెలిపించాలని కోరుతూ ఆయన మద్దతు దారులు దుగ్గిరాలలోని డిగ్రీకళాశాల, మాంటి స్సోరి స్కూల్ ఉపాధ్యాయులను కలిసి ఓట్లను అభ్య ర్థిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. జెట్టి బాలరాజు, వై. స్టాలిన్, వై. బ్రహ్మేశ్వరరావు, చిరంజీవి, భీమవరపు అమ్మిరెడ్డి, వల్లభనేని శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిటౌన్,(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణంలోని 7,9,10 వార్డులలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, సచివాలయంలో కూటమి నాయకులు, కార్యకర్తలు విస్తృత ప్రచారం నిర్వహించారు. వల్లభ నేని వెంకట్రావు మాట్లాడుతూ ఆలపాటి రాజేంద ప్రసాద్‌ను భారీ మెజారిటితో గెలిపించాలని కోరారు. రాష్ట్రం అభివృద్ది దిశగా అడుగులువేయాలంటే కూట మికి మద్దతు తెలియజేయాలని అన్నారు. కార్యక్ర మంలో ముమ్మడిసత్యనారాయణ, వల్లభనేని వెంకట్రా వు, నాగేశ్వరరావు, ఇట్టా భాస్కర్, అద్దంకి మురళి, ఉప్పు వెంకటేశ్వరరావు, రత్నకుమార్ పాల్గొన్నారు. ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను మొదటి ప్రాధాన్యతా ఓటుతో గెలిపించాలని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్ ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.


నల్లపాడు పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే రామాంజనేయులు

తాడేపల్లి (కొలనుకొండ) (ఆంధ్రజ్యోతి): కృష్ణా పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం తాడేపల్లి మండలం కొలనుకొండలోని ప్రజా సంఘాల నేతలు దొంతిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో పల్లె కృష్ణ, నాగపోగు విజయరాజు, పాల్గొన్నారు.

గుంటూరు(తూర్పు),(ఆంధ్రజ్యోతి): కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ని గెలిపించాలని ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు కోరారు. ఆలపాటికి మద్దతుగా స్థానిక నల్లపాడు ఎంటీఎస్ పాలిటె క్నిక్ కళాశాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.


శిల్పారామాన్ని సందర్శిస్తున్న మంజులారెడ్డి, బూర్ల రామాంజనేయులు

శిల్పారామం అభివృద్ధికి ప్రత్యేక కార్యచరణ

● ఏపీ శిల్పారామం ఆర్ట్స్, క్రాఫ్ట్స్, కల్చరల్ సొసైటీ ఛైర్మన్ మంజులారెడ్డి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): శిల్పారామం అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నామని ఏపీ శిల్పారామం ఆర్ట్స్, క్రాఫ్ట్స్ అండ్ కల్చరల్ సొసైటీ ఛైర్మన్ మంజులారెడ్డి అన్నారు. ఇన్నర్ రింగురోడ్డులోని శిల్పారామాన్ని ప్రత్తి పాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుతో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మంజులారెడ్డి మాట్లాడుతూ పర్యా టక ప్రాంతంగా శిల్పారామాన్ని తీర్చి దిద్దుతామని అన్నారు. సమావేశాలకు, సాంస్కృతిక ప్రదర్శనలకు ఏర్పాటు చేసిన ఆడి టోరియంను మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు. స్విమ్మింగ్ పూల్‌తో పాటు ఇతర సౌకర్యాలను సమకూరుస్తామని అన్నా రు. బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ నగరపాలక సంస్థ అధికారులతో మాట్లాడి శిల్పారామం చుట్టూ ప్రహరీ నిర్మిస్తామని అన్నారు. శిల్పారామంను అభివృద్ధి చేయగలిగితే చాలా మందికి ఉపాధి దొరుకుతుందని అన్నారు. కార్యక్రమంలో కార్పొ రేటర్ ఈరంటి వరప్రసాదు, ప్రత్తిపాడు ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిశీలకులు సామిశెట్టి వెంకటేశ్వరరావు, శిల్పారామం ఏవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి


గమిడి శివమ్మ

కొల్లిపర, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఓ కూలీ గుండెపోటుతో మృతిచెందింది. ఈ సంఘటన మండల పరిధిలోని దావులూరులో జరిగింది. స్థానికుల కథపం ప్రకారం గమిడి శివమ్మ (54) మంగళవారం ఉదయం దావులూరు సమీపంలో ఉన్న పంటకాలువ పూడిక తొలగింపు పనిచేస్తూ గుండెపోటుతో కుప్పకూలిపోయింది. దీంతో తోటి కూలీలు ఆమెను కొల్లిపర ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే శివమ్మ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

తెనాలి వార్తలు
◆ తెనాలి ◆ పొన్నూరు

నలుగురి మృతి బాధాకరం: ధూళిపాళ్ల

పెదకాకాని, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని సమీపంలోని కాళీమాత ఆశ్రమం ఆధ్వర్యంలో నడుస్తున్న గోమాత గోశాల షెడ్‌లో జరిగిన విద్యుత్ ప్రమాదంలో నలుగురు మరణించటం బాధాకరమని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారు వేరు వేరు ప్రాంతాల నుంచి బతుకుతెరువు కోసం వచ్చి ఇక్కడ తుదిశ్వాస విడవడం బాధాకరమని, చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

వాహన తనిఖీల్లో 13 బైక్‌లు సీజ్

తెనాలి క్రైం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రవాణా శాఖ అధికారులు జరిపిన తనిఖీలలో భాగంగా సరైన పత్రాలు, హెల్మెట్, సైలెన్సర్‌లేని 13 వాహనాలను సీజ్ చేసి రూ.70వేలు అపరాధ రుసుం విధించడం జరిగిందని రవాణాశాఖ అధికారి టి.రాఘవరావు తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, గతంలో లాగా కాకుండా కొత్త నిబంధనలు మేరకు వాహనాలు వెంటనే సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు.

144 సెక్షన్ అమలు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. ఈ నెల 25 నుండి మార్చి 5వరకూ అమలులో ఉంటుందన్నారు.

ఇంటర్మీడియట్ ఎగ్జామ్ సెంటర్స్ వద్ద..

మార్చి 1 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్‌మీడియట్ పరీక్షల నేపథ్యంలో పరీక్ష సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ షాపులు వంటివి కూడా తెరవకూడదన్నారు. మార్చి 20వరకూ ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి, 25 (ఆంధ్రజ్యోతి): చేపలకు మేత వేసే పనికి వెళ్ళి ప్రమాదవశాత్తూ చెరువులో పడి గల్లంతయిన వ్యక్తి మృతిచెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ గండు కిరణ్‌కుమార్ కథనం ప్రకారం బాపట్ల జిల్లా గుడిపూడి గ్రామానికి చెందిన దాసరి ధన్‌బాబు (45) పొన్నూరు మండల నండూరులో చేపల చెరువులో చేపలకు మేత పెట్టడానికి వెళ్తుంటాడు. ఎప్పటిలాగానే చేపలకు మేత వేయడానికి చెరువులోకి వెళ్ళిన ధన్‌బాబు అతను వినియోగించిన పడవ పక్కకు ఒరిగిపోవడంతో చెరువులో పడి గల్లంతయ్యాడు. స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి ఎస్ఐ కిరణ్‌కుమార్ చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. ధన్‌బాబు మృతదేహాన్ని వెలికితీయగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. దీనిపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు.

పరీక్షలంటే భయం వద్దు: తెలంగాణ జీఎస్టీ జాయింట్ కమిషనర్ శ్రీలీల

తెనాలి, ఫిబ్రవరి 25, (ఆంధ్రజ్యోతి): రేపటి పది పరీక్షలకు భయపడాల్సిన పనిలేదని, ఒక ప్రణాళికతో, ఇష్టపడి చదివితే తేలికగా ఉత్తీర్ణత సాధిస్తారని, దీనికి కృషి, పట్టుదలే ముఖ్యమని తెలంగాణ రాష్ట్ర జీఎస్టీ జాయింట్ కమిషనర్ యడ్ల శ్రీలీల అన్నారు. కొత్తపేటలోని మున్సిపల్ బాయిస్ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థులు నిర్వహించిన స్ఫూర్తి కార్యక్రమానికి మంగళవారం ఆమె విచ్చేశారు. కార్యక్రమంలో ఎంఈవో లక్ష్మీనారాయణ, హెచ్.ఎం షేక్ మౌలాలి, విశ్రాంత ఉపాధ్యాయుడు సుబ్బారావు, తన్నీరు శివశంకర్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి: ధూళిపాళ్ల

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి, 25 (ఆంధ్రజ్యోతి) ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికపై సమీక్ష జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉదయం 8గంటలకు పోలింగ్ బూత్‌లకు వెళ్ళి ఓటు హక్కు వినియోగించుకోవాలని ఓటర్లను కోరాలన్నారు. సమావేశంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు

కొల్లిపర, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల సందర్భంగా మంగళవారం మండల కేంద్రం కొల్లిపర హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన మూడు ఎన్నికల పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ సిద్ధార్థ, ఎన్నికల అధికారి, ఇరిగేషన్ జేఈ విజయరాజు, ఇన్‌ఛార్జీ ఎంపీడీవో భార్గవ్‌లు పరిశీలించి రెవెన్యూ అధికారులకు పలు సూచనలు చేశారు.

తిరునాళ్లకు క్వారీలో సర్వం సిద్ధం

- విద్యుత్ ప్రభల రాకపోకలకు మార్గం సుగమం
- మూడులక్షల మంది భక్తులు వస్తారని అంచనా
- లింగోద్భవ అభిషేకాలకు ఏర్పాట్లు


నారాకోడూరులో ఏర్పాటుచేసిన భారీ విద్యుత్ ప్రభ

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), ఫిబ్రవరి, 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలోని శైవక్షేత్రంగా వెలుగొందుతున్న వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి ఆలయం మహా శివరాత్రి ఉత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబయింది. శివరాత్రి సందర్భంగా జరిగే ఉత్సవాలకు మూడు లక్షల పైగా భక్తులు జిల్లా నలుమూలల నుంచి రానున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు ఇప్పటికే దేవదాయశాఖ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. చలువ పందిళ్ల నిర్మాణంతో పాటు క్యూలైన్లు ఏర్పాటు ఏర్పాటు చేశారు. ప్రతి భక్తుడు స్వామివారి మూలవిరాట్‌ను దర్శించుకునేలా ఏర్పాట్లు జరిగాయి. స్థానిక శాసన సభ్యుడు ధూళిపాళ్ల నరేంద్రకుమార్ సూచనలతో ఉచిత దర్శనాలను ఏర్పాటు చేశారు. గతంలో ఉన్న టిక్కెట్లు వ్యవస్థను రద్దుచేశారు. ఇప్పటికే రెండు రోజులుగా శివరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయి. సోమవారం ఏకాదశి సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి రాగా రెండో రోజు మంగళవారం కూడా భక్తులు విశేష సంఖ్యలో స్వామివారి దర్శనాలకు పోటెత్తారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ట్రాఫిక్ మళ్లించి రద్దీ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయం సమీపంలోని ఖాళీ ప్రదేశాలను శుభ్రం చేయించి వాహనాల పార్కింగ్ కోసం స్థలాలు కేటాయించారు. తెనాలి సబ్ కలెక్టర్ సంజనాసింహ దీక్ష ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ప్రభల వద్ద ప్రత్యేక పర్యవేక్షణ

ఈ ఏడాది మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏడు భారీ విద్యుత్ ప్రభలు ఆలయానికి చేరుకుంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఒక్కో ప్రభ ఎత్తు 50 అడుగుల పైగానే నిర్మించారు. ప్రభల రాకపోకలకు మార్గాల్లో ఎలాంటి అంతరాయం కలుగకుండా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఒక్కో ప్రభ వద్ద ఒక ఎస్ఐ, ఐదుగురు పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రభల నిర్వాహకులను పోలీసు అధికారులు బైండోవర్ చేశారు. జిల్లాలో ఎమ్మెల్సీ కోడ్ అమల్లో ఉన్నందున రాత్రి 1.30గంటలకు ఉత్సవాలు ముగించేలా ఏర్పాట్లు చేసుకోవాలని ప్రభల నిర్వాహకులకు ఆదేశించారు. ప్రభల వద్ద అసాంఘిక కార్యకలాపాలు నిషేధించినట్లు, ఈ ఉత్సవాలకు జిల్లాలోని 500 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు, అలాగే పారిశుధ్య పనులకు పొన్నూరు, చేబ్రోలు, తెనాలి ప్రాంతాల్లోని పారిశుధ్య కార్మికులకు ఇక్కడ విధులు కేటాయించారు. అగ్నిమాపక సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. శివరాత్రి ఉత్సవాలు సజావుగా సాగేందుకు భక్తులు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

44వ వసంతంలోకి శలపాడు ప్రభ

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వడ్లమూడిలోని బాలకోటేశ్వరస్వామి ప్రభల ఉత్సవానికి గత 44 సంవత్సరాలుగా శలపాడు చౌదరి యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారీ విద్యుత్ ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ ఏడాది కూడా శివరాత్రి పర్వదినానికి గ్రామస్థుల ఆధ్వర్యంలో 50 అడుగుల భారీ విద్యుత్ ప్రభ నిర్మించి ఉత్సవాలకు సిద్ధం చేశారు.


ఆర్యవైశ్య అన్నదాన సత్రం వద్ద అన్నదానం కోసం చేస్తున్న ఏర్పాట్లు

కొల్లిపర మండలంలో...

కొల్లిపర, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా మంగళవారం శివాలయాల్లో పండితులు అభిషేకాలు నిర్వహించి పార్వతీపరమేశ్వరులకు ఘనంగా పూజలు చేశారు. వల్లభాపురం, మున్నంగి, తూములూరు, దావులూరు, హనుమాన్‌పాలెం, అన్నవరం, అత్తోట, చివలూరు, సిరిపురం, దంతలూరు గ్రామాల్లోని శివాలయాల్లో పండితులు తెల్లవారు జామునుంచే అభిషేకాలు నిర్వహించి శివలింగాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. మండల కేంద్రం కొల్లిపర గంగా పార్వతీ సమేత ముక్తేశ్వరస్వామి దేవస్థానంలో పండితులు సుప్రభాత సేవ, అష్టోత్తర గరికపూజ, ఏకాదశ రుద్రాభిషేకం, తదితర పూజలు నిర్వహించారు. అదే విధంగా మండల పరిధిలోని ము న్నంగి, కొల్లిపర శివాలయాల్లో పార్వతీపరమేశ్వర్లును పెండ్లికుమార్తెగా, పెండ్లి కుమారుడుగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలను చూడటానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాల ఈవోలు భక్తులకు తగిన సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

అమృతలూరులో అన్నదానానికి ఏర్పాట్లు

అమృతలూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రం గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయ మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్నదానం చేసేందుకు ఆయా సామాజిక వర్గాలకు చెందిన అన్నదాన సత్రాలు సిద్ధమైయ్యాయి. బాలకోటేశ్వర కన్యకాపరమే శ్వరి అర్యవైశ్య యెనిశెట్టి రంగనాయకులు శ్రేష్టి అన్నదాన సత్రంలో 62వ సంవత్సరం ఆర్యవైశ్య సోదరులకు అన్నదానం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. వీటిని అధ్యక్షుడు కొత్తమాసు సాంబశివరావు, శిఖాకొల్లి తాండవకృష్ణ, చేబ్రోలు వెంకటేశ్వర్లు, తమ్మన సాంబశివరావు, కొమ్మూరి మురళీకృష్ణ, కొత్తమాసు రమణకుమార్‌లు, తూనుగుంట్ల వెంకటసుబ్బారావు, చీమకుర్తి మోహనవెంకటేశ్వరరావు, కపలవాయి శ్రీనివాసరావు, నేరెళ్ళ వెంకటసుబ్బారావు, పొట్టి శ్రీదర్‌లు పర్యవేక్షిస్తున్నారు.

ముస్తాబైన శైవక్షేత్రాలు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని పట్టణంలోని శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. గంగానమ్మపేటలోని పరశురామ ప్రతిష్ఠిత ప్రాచీన పాతశివాలయంలో శివరాత్రి ఉత్సవాలు రెండు రోజులు ముందే మొదలయ్యాయి. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులు భారీగా తరలివచ్చే ఈ ఆలయంలో స్వామివారి దర్శనానికి దేవదాయ శాఖ విస్తృత ఏర్పాట్లుచేసింది. బుధవారం తెల్లవారుజాము నుంచి స్వామివారికి అభిషేకాలు నిర్వహిస్తారు. ఉదయం రావణ బ్రహ్మ వాహన సేవ, రాత్రికి లింగోద్భవ కాలాభిషేకం, ఎదురుకోల ఉత్సవం జరుపుతారు. శ్రీపర్వత వర్ధిని సమేత శ్రీరామేశ్వరస్వామి వారికి దివ్య కళ్యాణం నిర్వహిస్తారు. 27న స్వామి వారి దివ్య రథోత్సవం వైభవంగా జరుగుతుంది. పురాతనమైన చక్కతో చేసిన రథాన్ని వినియోగిస్తారు. పట్టణంలోని ప్రధాన వీధులలో ఊరేగించేందుకు గాను విద్యుత్ లైన్లు కూడా తొలగిస్తారు. రథోత్సవానికి పెదరావూరు యువత ఏటా చొప్పాలు వేసే సేవ అందిస్తున్నారు. మారీసుపేటలోని చంద్రమౌళేశ్వరస్వామి ఆలయం, రామలింగేశ్వరపేటలోని రామలింగేశ్వరస్వామి ఆలయం, చినరావూరు సోమేశ్వరాలయంలో శివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు గావించారు.

శేష... నర నంది వాహన సేవలు

మహా శివరాత్రి పురస్కరించుకుని రామేశ్వర స్వామికి మంగళవారం శేష వాహన సేవ, నరనంది వాహన సేవ నిర్వహించారు. అలంకరించిన రథంపై స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉంచి ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఆలయ అర్చకులు సురేష్, ఈవో రమణకుమారి, వ్యవస్థాపక ధర్మకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


విద్యుత్ దీపాలతో అలంకరించిన తూములూరు శివాలయం

శివరాత్రికి ఏర్పాట్లు సక్రమంగా చేయాలి

● మునిసిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శివాలయాలకు వచ్చే భక్తులు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పారిశుధ్యపనులు మెరుగుపరచాలని మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అన్నారు. మంగళవారం పట్టణంలోని శివాలయాల వద్ద జరుగుతున్న పారిశుధ్య పనులను కమిషనర్ శేషన్న క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని ఆలయాలకు తెల్లవారు జామునుంచే విశేష సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని వారికి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాల వద్ద శానిటేషన్ పనులు చేపట్టడం జరిగిందన్నారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో స్వామి వారి దర్శనం చేసుకునేలా మునిసిపాలిటీ అధికారులు సిబ్బంది అవసరమైన చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పలువురు మునిసిపల్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సాంస్కృతిక ప్రదర్శనలు చేస్తున్న విద్యార్థులు

ఘనంగా నవోదయ విద్యానికేతన్ వార్షికోత్సవం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గంగానమ్మపేటలోని నవోదయ విద్యానికేతన్ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. రైల్వే స్టేషన్ మేనేజర్ పి.వెంకటరమణ మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని, ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. విద్యా సంవత్సరంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. బాలకృష్ణమూర్తి, నరేంద్రబాబు, వెంకటేశ్వరరావు, వెంకటకృష్ణ, సుబ్బారావు, హకుల్‌నాథ్, పోతిరెడ్డి, వ్యవస్థాపకులు చదలవాడ బుచ్చయ్య తదితరులు ప్రసంగించారు.


ఎమ్మెల్సీ ఎన్నికలపై సూచన చేస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

పట్టభద్రులందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడండి

● తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలి రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ గోపాలకృష్ణ అన్నారు. మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఎమ్మెల్సీ ఎన్నికలపై పలు సూచనలు చేశారు. మండల వీఆర్వోలు, పలువురు అధికారలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్జీవో సంఘంలో ముసలం

తెనాలి, ఫిబ్రవరి 25, (ఆంధ్రజ్యోతి): గతంలో ఎటువంటి నిరంకుశ విధానంలో ఎన్జీవో సంఘం ఎన్నికలు జరిగాయో, ఇప్పుడు కూడా అదే పద్ధతి కొనసాగుతోందని బైలాకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న తీరు జీర్ణించుకోలేని విధంగా ఉండటంపై నిరసనగా సంఘం నుంచి మేము బయటకు వెళ్లిపోతున్నామని కొందరు సభ్యులు బాయ్‌కాట్ చేశారు. ఏ విధమైన కార్యక్రమాల్లో పాల్గొనలేమంటూ తెనాలి ఎన్జీఓ సంఘంలో ఉన్న పాలకవర్గం కాక మరో ఐదుగురు సభ్యుల స్థానాలు ఖాళీగా ఉండటంతో వాటికి ఎన్నికలు నిర్వహించాలంటూ సంఘంలోని ఒక వర్గం గత కొంత కాలంగా జిల్లా కార్యవర్గాన్ని పట్టుబడుతోంది. 15 రోజుల క్రితం యూనిట్ అధ్యక్షుడు రిజైన్ చేస్తే, దానిని జిల్లా అధ్యక్షులు కూడా ఆమోదించారని, అయితే నిబంధనలకు విరుద్ధంగా రిజైన్ చేసిన వ్యక్తి ఎన్నిక నిర్వహిస్తున్నానంటూ ప్రకటించటం విడ్డూరంగా ఉందని కృష్ణమోహన్ ఆక్షేపణ వ్యక్తంచేశారు. ఎక్కడా పారదర్శకత లేదని, బైలాను పక్కనపెట్టి, గతంలో ఎట్లా ఏకపక్షంగా జరిగిందో అదేతీరులో నేడుకూడా వ్యవహరిస్తున్నారని, దీనిని మేము వ్యతిరేకిస్తున్నామని, రానున్న 8 నెలలు మెజారిటీ సభ్యులమైన మేము సంఘ కార్యక్రమాల్లో పాల్గొనేది లేదని ప్రకటించారు. అయితే ఎన్నిక విషయంలో వ్యవహరించిన తీరుపై రాష్ట్ర కార్యవర్గానికి తెలియచేస్తామని, న్యాయపోరాటంకూడా చేస్తామని వారు ప్రకటించారు.

ఘనంగా జేఎంజే కళాశాల వార్షికోత్సవం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రోడ్డులోని జేఎంజే మహిళా కళాశాల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. నాగార్జున యూనివర్శిటీ కౌన్సిల్ డీన్ ప్రొఫెసర్ రవికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, విద్యార్థులు ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలంటే నైపుణ్యాలు సాధించాలన్నారు. ప్రతి విద్యార్థి అయిపోయిన కాలం తిరిగి రాదని గ్రహించి కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రొఫెసర్ పద్మ, కరస్పాండెంట్ థెరిసమ్మ, ప్రిన్సిపల్ షైనీ, మేరి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా కూటమి శ్రేణుల ప్రచారం

తెనాలి రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, నిరుద్యోగుల కష్టాలు తెలిసిన నాయకుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ని ఎమ్మెల్సీగా ప్రథమ ఓటు వేసి గెలిపిద్దామని కూటమి నాయకులు అన్నారు. మంగళవారం పట్టణంలో కృష్ణా, గుంటూరు ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆలపాటిని గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వాసుదేవనాయుడు, విజయభాస్కర్‌రెడ్డి, మైలా హరికృష్ణ, నన్నపనేని రాంబాబు, అక్కేశ్వరరావు, సోపాటి కిరణ్, రావూరి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

● తెనాలి రూరల్: ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటిని గెలిపించుకుందామని టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నాయకులతో కలిసి తాడిబోయిన హరిప్రసాద్ విలేకరుల సమావేశం నిర్వహించారు.

● తెనాలి: కూటమి బలపరచిన కృష్ణ, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని, పోలింగ్ రోజు ప్రతి ఓటరును పోలింగ్ బూత్ దగ్గరకు తీసుకువెళ్లేలా కూటమి పార్టీల కార్యకర్తలు కృషి చేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి కోరారు. అనారోగ్యంతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. తాను పోలింగ్‌కు ముందు ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేకపోయానని, ఆసుపత్రిలో ఉండటం వల్ల సాధ్యం కాలేదని, అయితే పార్టీ అభ్యర్థి గెలుపుకోసం అందరం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

● తెనాలి క్రైం: నాయకత్వ పటిమ కలిగి సమస్యల పరిష్కారానికి ముందుండి నడిచే వ్యక్తి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అలాంటి వ్యక్తిని ఎమ్మెల్సీ ఎన్నికల ద్వారా పెద్ద సభకు పంపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్ పేర్కొన్నారు. మంగళవారం బార్ అసోసియేషన్ హాలులో పట్టణ న్యాయవాదుల ఆత్మీయ సమావేశంలో మాజీ మంత్రి వర్యులు, సీనియర్ న్యాయవాది ఆలపాటికి ఘన విజయం సాధించే విధంగా న్యాయవాదులు తమ వంతు కృషి చేయాలని సీనియర్ న్యాయవాది తాడిబోయిన శ్రీనివాసరావు కోరారు.


పెదకాకాని పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యుత్ ప్రమాద బాధిత కుటుంబాలు

బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ధర్నా

● పెదకాకాని పోలీస్‌స్టేషన్ ఎదుట నాలుగు గంటల నిరసన
● ఆర్డీవో హామీతో ఆందోళన విరమణ

పెదకాకాని, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నంబూరు కాళీ బాబా ఆశ్రమానికి చెందిన గోశాలలో జరిగిన విద్యుత్ ప్రమాదంలో మృతిచెందిన కుటుంబాలకు న్యాయంచేయాలని, ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని బాధిత కుటుంబాలు ఆందోళనకు దిగాయి. మంగళవారం ఆటోనగర్ బైపాస్ వద్ద ఉన్న పెదకాకాని పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తూ, రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులందరూ యానాది సామాజిక వర్గానికి చెందినవారు అని. అందరూ కూడా పేదరికంలో ఉన్నారన్నారు. వారి కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు రూ.25లక్షలు చెల్లించాలని, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. సుమారు 4 గంటల పాటు జరిగిన పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తంచేశారు. సమాచారం తెలుసుకున్న గుంటూరు ఆర్డీవో శ్రీనివాసరావు ఆందోళనకారులతో సంప్రదించారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని, మృతుల కుటుంబాలకు రెండు సెంట్లు స్థలం, ఇంటి నిర్మాణానికి రుణాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో డీఎస్పీలు రామకృష్ణ, అరవింద, సీఐలు నారాయణస్వామి, అశహరి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయంపై నవరత్నాల పోస్టర్ తొలగింపు

'ఆంధ్రజ్యోతి'కి స్పందన


సచివాలయంపై తొలగించిన నవరత్నాల పోస్టర్

తెనాలి రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): బుర్రిపాలెంలోని సచివాలయంపై ఏర్పాటు చేసిన నవరత్నాలు పోస్టర్‌ను తొలగించరూ అంటూ ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. అదే రోజు సచివాలయం వద్దకు అధికారులు వెళ్లి లోగోను తొలగించారు.

ఇంటూరు రోడ్డులో చెత్త తొలగింపు


ఇంటూరు రోడ్డు మార్గంలో చెత్త తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి, 25 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని ఇంటూరు రోడ్డులో డోజర్లతో చెత్త తొలగింపు పనులను మంగళవారం పురపాలక సంఘం అధికారులు ప్రారంభించారు. పట్టణంలో ఇంటూరు రోడ్డులో గత ఐదేళ్లుగా చెత్తాచెదారాలను రోడ్డు మార్జిన్లో వేయడం వలన రోడ్డు ఆక్రమణకు గురై వ్యర్థాలతో నిండిపోయింది. పొన్నూరు వైపు నుంచి ఇంటూరు వైపు ప్రయాణించే వాహనదారులకు ఈ చెత్తకుప్పలు అవరోధంగా మారాయి. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గోవాడ బాలకోటేశ్వరస్వామి ఆలయానికి పెద్ద సంఖ్యలో ఈ మార్గం నుంచి భక్తులు వెళ్తుంటారు. భక్తుల ఇబ్బందులను గుర్తించి మున్సిపల్ కమిషన్ ముప్పాళ్ల రమేష్‌బాబు మంగళవారం చెత్త తొలగింపు పనులకు శ్రీకారం చుట్టారు.